

ప్లాంటు ఏర్పాటు ఆనందదాయకం



అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధిత ప్రాంతాలకు న్యాయం చేయాలని తాము ఇచ్చిన వినతి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాంతంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఎంతో ఆనందదాయకం. అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధిత ప్రాంతాలైన పులపత్తూరు, తొగురుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు, మందపల్లె చుట్టుపక్కల గ్రామస్థుల తరపున నిరుద్యోగుల తరపున సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వం తప్పిదాల వల్ల ప్రాజెక్టు తెగిపోయి సర్వనాశనమైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో 500 మందికి ఉపాధి కల్పించే బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి కేబినెట్ ఆమోదం తెలపడం ఎంతో శుభపరిణామం. ఇలాంటి పరిశ్రమలను మరెన్నో తీసుకువస్తాం.

- చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ ఇన్‌చార్జ్, రాజంపేట

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను స్వీకరించారు. రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జీఎస్‌డబ్ల్యుఎస్ లక్ష్మీపతి, సర్వే ఏడీ భరత్‌కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో సమస్యలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో డిసెంబరు 3వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కలకడ మండలం కోన గ్రామం గంగిరెడ్డిగారిపల్లె దళితవాడకు చెందిన సి. జయమ్మ కోన గ్రామంలో తనకు 1.50 సెంట్లు భూమి ఉందని, దానికి అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు రాలేదని, ఈ విషయమై న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. కావలిగడ్డకు చెందిన గురజాల నాగమ్మ తన భర్త గురజాల నాగయ్య మరణించడంతో తనకు వితంతు పింఛను ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించింది.

రాజంపేటలో బయోగ్యాస్ ప్లాంటు

- ఇటీవల కేబినెట్‌లో ఆమోదం
- అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులకు న్యాయం
- పులపత్తూరులో ఏర్పాటుకు రిలయన్స్ గ్రీన్ సిగ్నల్
- ప్లాంటు నిర్మాణంతో 500 మందికి ఉపాధి
- 150 ఎకరాల కేటాయింపునకు రెవెన్యూ శాఖ నిర్ణయం

పులపత్తూరు ప్రాంతంలో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంటు



రాజంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య ముంపు బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భారీ బొనాంజా ప్రకటించారు. అన్నమయ్య ప్రాజెక్టు ముంపు ప్రభావిత ప్రాంతాలైన పులపత్తూరు చుట్టుపక్కల గ్రామాలకు స్వయం ఆర్థికాభివృద్ధి కోసం 500 మందికి ఉపాధి కల్పించే రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల అన్నమయ్య ముంపు బాధిత ప్రాంతాలకు స్వయం ఉపాధి లభించనుంది. రిలయన్స్ ద్వారా బయోగ్యాస్ ప్లాంట్ ఇక్కడ నిర్మించనున్నారు. రాజంపేట మండలానికి 12 కిలోమీటర్ల దూరంలో ఇటీవల అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినప్పుడు ప్రాణ, ఆస్తినష్టం భారీగా జరిగిన పులపత్తూరు పరిసర ప్రాంతాల్లో ఈ బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. సుమారు 200 కోట్ల రూపాయల ఖర్చుతో ఈ ప్లాంటును ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రకాశం జిల్లా దివాకరపురం వద్ద 2 వేల మందికి ఉపాధి కల్పించే బయోగ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా పులపత్తూరు వద్ద 500 మందికి ఉపాధి లభించే మధ్య తరహా బయోగ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నారు. గుండ్లూరు, పులపత్తూరు ప్రాంతాల్లో 150 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపింది. ప్రధానంగా చెత్త, గడ్డి నుంచి ఉత్పత్తి అయ్యే వాయువుల గుండా బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు. దీనివల్ల రాజంపేట పట్టణంలో ప్రతిరోజూ సేకరించే చెత్తా చెదారాల వ్యర్థాలను ఈ పరిశ్రమకు తరలిస్తారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉండే వ్యర్థాలను, గడ్డిని కూడా ఈ పరిశ్రమలకు ఉపయోగిస్తారు. రైతులు పండించే గడ్డి, ఇతర వ్యవసాయ వ్యర్థాలను ఈ పరిశ్రమకు తరలిస్తారు. వ్యర్థాలను కంప్రెస్ చేసి వంటగ్యాస్‌ను, వాహనాలు నడవడానికి ఉపయోగించే గ్యాస్‌ను ఇక్కడ తయారు చేస్తారు. వ్యర్థాల నుంచి తయారు చేసే ఉత్పాదకత వల్ల గ్రామీణాభివృద్ధి పెరుగుతుంది. వ్యవసాయ వ్యర్థాలు ఈ పరిశ్రమకు ఉపకరిస్తాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భూముల ద్వారా భూమిని ఈ పరిశ్రమలకు కేటాయిస్తారు. సొంత భూములకు ఎకరాకు రూ.31 వేలు, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న డీకేటీ భూములకు ఎకరాకు 15 వేల రూపాయలను ఈ ప్రాజెక్టు కింద ఏడాదికి ఇవ్వనున్నారు. దీంతో రైతులు కూడా ఈ పరిశ్రమకు తమ భూములు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. వ్యవసాయ వ్యర్థాలు, గృహ వ్యర్థాలను కలిపి గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఈ పరిశ్రమలను ఏర్పాటు చేస్తారు. మనం పనికిరాని వ్యర్థాలుగా భావించి బయట పడేసే వాటి ద్వారా ఈ పరిశ్రమలను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించి తద్వారా ఆదాయం పొంది గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారు. ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ముంపు బాధితులకు న్యాయం జరుగుతోంది



ఎట్టకేలకు అన్నమయ్య ముంపు బాధితులకు న్యాయం జరుగుతోంది. ఈ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల సుమారు 500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. సుమారు రూ.200 కోట్లతో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేయడం శుభపరిణామం. దీనివల్ల అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో యువకులకు ఉపాధి లభించనుంది. దీనివల్ల కూటమి ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడినట్లు అవుతుంది. నాలుగేళ్లుగా ప్రాజెక్టు తెగిపోయి ఉపాధి దొరకక అనేక ఇబ్బందులు పడుతున్న మా ప్రాంతాలకు బయోగ్యాస్ ప్లాంట్ ఓ వరం లాంటిది.

- కొండా శ్రీనివాసులు, మందపల్లె గ్రామం, రాజంపేట

భూమిని కేటాయించడానికి నిర్ణయించాం



రాష్ట్ర ప్రభుత్వం పులపత్తూరు ప్రాంతంలో బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేయడానికి సుమారు 150 ఎకరాల భూమిని కేటాయించడానికి నిర్ణయించాం. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ భూమిని కేటాయిస్తున్నాం. ఇప్పటికే ప్లాంటు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో భూమి వివరాలను సేకరించి అందుకు సంబంధించిన వివరాలను కూడా ప్రభుత్వానికి నివేదించాం. దీనివల్ల ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటై నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. రెవెన్యూ శాఖ ద్వారా ఈ ప్లాంటు ఏర్పాటుకు భూకేటాయింపులు పూర్తి చేస్తాం. తమ శాఖ ద్వారా అన్నివిధాలా సహకరిస్తాం.

- పీర్‌మున్నీ, తహసీల్దారు, రాజంపేట

‘రైతన్నా మీకోసం’లో సర్వే ఉద్యోగుల డుమ్మా

- పలుచోట్ల హాజరుకాని వీఆర్‌వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు
- తొలిరోజున ఆశించిన స్థాయిలో వెలువడని ఫలితాలు



మదనపల్లె మండలం సీటీఎం గ్రామంలో రైతన్నా మీకోసంలో పాల్గొన్న రైతులు, అధికారులు

మదనపల్లె టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఆషామాషీగా తీసుకున్నారు. జిల్లాలోని 30 మండలాల ఎంపీడీవోలు స్పష్టంగా రైతన్నా మీకోసం సర్వేలో పాల్గొనాలని ముగ్గురు సభ్యులను బృందాలుగా ఏర్పాటు చేసి ఆదేశాలు జారీ చేసినా పలు మండలాల్లో వీఆర్‌వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు డుమ్మా కొట్టారు. కొందరు నామమాత్రంగా హాజరై ఫొటోలు తీసుకుని వెళ్లిపోయారు. జిల్లాలోని 30 మండలాల్లో ఆరు రోజులు పాటు నిర్వహించనున్న రైతన్నా మీకోసం కార్యక్రమంలో 2,55,201 రైతుల కుటుంబాల వద్దకు సర్వే సభ్యులు వెళ్లాల్సి ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను, పంచసూత్రాలను రైతులకు వివరించాల్సి వుంది. జిల్లాలో 271 గ్రూపులకు ఎంపీడీవోలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కానీ తొలిరోజైన సోమవారం పలు మండలాల్లో కేవలం వీఏఏ, వీహెచ్ఏలు, ప్రొగ్రెసివ్ ఫార్మర్లు మాత్రమే కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో తొలిరోజున 41,866 రైతుల కుటుంబాలను పలకరించాల్సి వుండగా, కేవలం 25,455 రైతులు కుటుంబాల ఇళ్లకు మాత్రమే అధికారులు వెళ్లి సర్వే చేశారు. ఈ విషయమై కలెక్టర్ నిశాంత్‌కుమార్ పలువురు ఉద్యోగులకు క్లాసు తీసుకున్నట్లు సమాచారం. రెండోరోజు నుంచైనా ఉద్యోగులు ఈ సర్వేలో 100 శాతం పాల్గొంటారా లేదా అన్నది చూడల్సి ఉంది.


రూ.92 లక్షల రవాణా భత్యం విడుదల

● డీసీఈబీ కార్యదర్శి తాటిపర్తి గంగాధరం

పీలేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం రూ.91.17 లక్షల తొలి విడత రవాణా భత్యం విడుదల చేసిందని డీసీఈబీ కార్యదర్శి తాటిపర్తి గంగాధరం సోమవారం తెలిపారు. పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రవాణా భత్యం చెల్లించేందుకు నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని 3039 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆ నిధులు త్వరలోనే విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచడం, డ్రాపౌట్‌ల సంఖ్య తగ్గించడం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రవాణా ఖర్చులు తగ్గి విద్యార్థులు నిరంతరం చదువుకునేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు.

ఇక మదనపల్లె జిల్లా

- సీఎం పచ్చజెండా
- మంత్రుల సబ్ కమిటీ సమావేశంలో నిర్ణయం
- నేడు ప్రిలిమనరీ నోటిఫికేషన్



మదనపల్లె మ్యాప్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కొత్తగా మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పచ్చజెండా ఊపారు. సోమవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రుల సబ్‌కమిటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం మదనపల్లె జిల్లా ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రిలిమనరీ నోటిఫికేషన్ జారీ చేయనుంది. దీంతో ఎన్నికల ప్రచారం సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు అయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రజల అభీష్టాలకు విరుద్ధంగా పాలనాపరమైన ఇబ్బందులు పరిగణలోకి తీసుకోకుండా చేశారని పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళనలు చేసినా అప్పట్లో పట్టించుకోలేదు. అప్పటి ప్రభుత్వం మొండిగా వెళ్లి జిల్లాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి కడప జిల్లాలో మూడు నియోజకవర్గాలు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు నియోజకవర్గాలను కలిపి అన్నమయ్య పేరుతో కొత్త జిల్లాను ఏర్పాటు చేసి రాయచోటిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. బ్రిటీష్ కాలం నుంచి రాష్ట్రంలోనే పెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఉన్న మదనపల్లెను జిల్లా కేంద్రం చేయాలని అప్పట్లో పెద్ద ఎత్తున ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఆందోళనలు చేశాయి. అయినా మదనపల్లెను జిల్లా కేంద్రంగా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల సందర్భంగా మదనపల్లెకు ప్రచారానికి వచ్చిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే మదనపల్లెను జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. తన యువగళం పాదయాత్ర సందర్భంలో నారా లోకేశ్ సైతం ఇదే హామీని ఇచ్చారు. అనుకున్నట్లే ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్త జిల్లాల ఏర్పాటు విషయం తెరపైకి వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటు కోసం రాష్ట్ర మంత్రులతో ఒక సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇప్పటికే ఈ కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై పలువురి నుంచి వినతులు స్వీకరించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మార్కాపురం, మదనపల్లె జిల్లాల ఏర్పాటు పట్ల మాత్రమే మొగ్గు చూపింది. ఈ నేపథ్యంలో మంత్రుల సబ్ కమిటీతో ముఖ్యమంత్రి సోమవారం అమరావతిలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మదనపల్లె, మార్కాపురం జిల్లాల ఏర్పాటుకు పచ్చజెండాను ఊపారు. ఈ ప్రక్రియలో భాగంగా నేడు ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. దీంతో రానున్న ఒకటి రెండు నెలల్లో ఇందుకు సంబంధించి ప్రక్రియ పూర్తయి మదనపల్లె జిల్లా ఏర్పాటు కానుంది.

ప్రతిపాదిత నూతన మదనపల్లె జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, రెండు రెవెన్యూ డివిజన్లు, 21 మండలాలు ఉండనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు పరిశీలన సబ్‌కమిటీకి ఇప్పటికే నివేదిక సమర్పించింది. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో ఉన్న మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలకు అదనంగా చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరును కలిపి మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయనున్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు జతగా పీలేరు రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ జిల్లాలో 21 మండలాలు, రెండు రెవెన్యూ డివిజన్లు, నాలుగు నియోజకవర్గాలు ఉండనున్నాయి.

జనార్ధన్‌రావు చెప్పాడు...మేం చేశాం

6

● నకిలీ మద్యం కేసులో కస్టడీకి ఆరుగురు నిందితులు

భూదాహానికి పాల్పడింది మీరు కాదా!

- 15 ఏళ్లలో మీరు చేయని అభివృద్ధి 15 నెలల్లో మేము చేస్తున్నాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా 15 ఏళ్లుగా ఉంటూ రాయచోటి ప్రజలకు, రైతులకు శాశ్వత తాగు, సాగునీరు పరిష్కారం చూపని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 15 నెలల్లో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక ముఖ్యమంత్రిపై, తనపై తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో భూరికార్డులు తారుమారవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019 నుంచి 24 వరకు వైసీపీ ప్రభుత్వంలో రికార్డులు తారుమారు చేసిన ఘనత వారిదేనన్నారు. వారి వద్ద ఆధారాలు ఉంటే నిరూపిస్తే ఆ అధికారులపై విచారణ చేయిస్తామని ఇందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఫ్రీ హోల్డ్ పేరుతో జిల్లాలో 30 వేల ఎకరాలు చేర్చి ఆ భూములను వైసీపీ నాయకులు, కార్యకర్తలకు కట్టబెట్టారని తెలిపారు. పేదలకు అందాల్సిన ఇళ్లు కూడా వైసీపీ కార్యకర్తలు లాక్కున్నారని తెలిపారు. జగనన్న కాలనీల పేరుతో పది వేల కోట్లు ఖర్చు చేసి ఎకరా భూమి 2 లక్షలతో కొని సుమారు 50 లక్షలతో ప్రభుత్వానికి అమ్మిన ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. సంబేపల్లె మండలంలోని నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీలో ఎంత ప్రభుత్వ భూమి ఇచ్చారు. ఎంత ప్రైవేటు భూమి కొన్నారు. ఇప్పటికీ వైసీపీ నాయకుల ఆధీనంలో ఎంత భూమి ఉంది. దీనిని నిరూపించేదానికి తాను సిద్ధమని ఈ సవాల్‌ను స్వీకరించాలని తెలియజేశారు. ఐదేళ్లలో రాయలసీమ ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రిగా ఉండి ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలపై తాము సవాల్‌కు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలియజేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చడమే లక్ష్యం

● డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చడానికి ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ బేస్‌లైన్ సర్వేను చేపట్టినట్లు డీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాలోని 3689 ప్రాథమిక పాఠశాలల్లో 1,11,587 మంది విద్యార్థులకు అమలవుతున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీపై బేస్ లైన్ సర్వే లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) యాప్ ద్వారా సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో డైట్ విద్యార్థులు, క్లస్టర్ రీసోర్స్ పర్సన్స్, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ పాల్గొంటున్నారన్నారు. డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ రాయచోటి మండలం అబ్బవరం హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లక్ష్యం 1- 5 తరగతి విద్యార్థి పాఠ్యపుస్తకాన్ని సులభంగా చదవగలగడం, గణితంలో ప్రాథమిక లెక్కలు చేయగలగడం, తద్వారా 6వ తరగతి నుంచి ఉన్నత తరగతుల్లో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగేలా చేయడమేనన్నారు. కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయిని సాగరిక, సీఆర్‌పీ విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ, చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

- రూ.15 లక్షల విలువైన బంగారం, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ వెంకటాద్రి



మీడియా సమావేశంలో చోరీ కేసు నిందితుల వివరాలను వెల్లడిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15 లక్షల విలువైన బంగారు నగలు, నగదు, మోటారు సైకిళ్లు, సెల్‌ఫోన్లు, చీరలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి వివరాలను వెల్లడించారు. కేవీపల్లి మండలం తీతాగుంటపల్లికి చెందిన కుంచపు పురుషోత్తం, పూజారి శంకరయ్య, బండి బాలాజీలతో పాటు కలకడ మండలం కె.దొడ్డిపల్లికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి (వెటర్నరీ అసిస్టెంట్) కుంచపు మోహన్‌బాబు చైన్ స్నాచింగ్‌కు పాల్పడేవారు. వీరంతా కలిసి తాజాగా ఈనెల 10వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో ఓ బట్టల వ్యాపారిని వెంబడించి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి చంపుతామని బెదిరించి దోపిడీకి పాల్పడినట్లు తెలిపారు. దీనిపై కేవీపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో కేవీపల్లి మండలం తిమ్మాపురం క్రాస్ వద్ద నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 140 గ్రాముల బరువు గల 6 బంగారు చైన్లు, రూ.40 వేల నగదు, 4 మోటారు సైకిళ్లు, 4 సెల్‌ఫోన్లు, 15 చీరలు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పెట్టినట్లు ఆయన వివరించారు. నేరస్తులను పట్టుకోవడంలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన పోలీసులను నగదు బహుమతితో ప్రోత్సహించారు.

సమస్యలు పరిష్కరించండి

● ధర్నాలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు దాటినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ జీతాలతో సరైన హెచ్‌ఆర్ విధానం లేకుండా అనేకమంది ఉద్యోగులు కష్టాల్లో ఉన్నారని అన్నమయ్య జిల్లా జేఏసీ నాయకుడు సి.మురళీమోహన్‌రాజు తెలిపారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు, మినిమం టైం స్కిల్ అమలు చేసి జీతాలు పెంపు, సమయానికి చెల్లింపులు ఊసే లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంపు చేయడం, ఈపీఎఫ్ గ్రాట్యుటీ, పెన్షన్ అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 10వ తేదీ చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూఎస్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శివయ్య, పీఎస్‌టీయూ గౌరవ జిల్లా అధ్యక్షుడు చిన్నరెడ్డెన్న, జిల్లా కార్యదర్శి జక్రియాబాషా, మునిరెడ్డి ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి, మండల ప్రెసిడెంట్ అజీజుర్ రెహమాన్, అన్నమయ్య జిల్లా జేఏసీ సెక్రటరీ అలీహుస్సేన్, జిల్లా జాయింట్ సెక్రటరీ నామాల వెంకట్రమణ, ట్రెజరర్ నరసింహులు, క్షేత్రి శ్రీనివాసులు, అన్ని మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్షాలతో చెరువుల్లో జలకళ


యల్లమరాజు చెరువు

● ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు

రైల్వేకోడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పలు దఫాలుగా కురిసిన వర్షాలకు చెరువులు నిండాయి. కొన్ని చెరువులు నిండుకుండలా ఉన్నాయి. మరికొన్ని చెరువులు అలుగులు పారుతున్నాయి. నియోజకవర్గంలోని మొత్తం 52 చెరువులు జలకళ సంతరించుకున్నాయి.


చెరువుల్లో నీరు చేరడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. రైతులు చెరువుల కింద వరి నాట్లు వేసుకోవడానికి సమాయత్వం అవుతున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో ఉన్న చెరువు కింద ఆయకట్టు 8 వేల హెక్టార్లలో వరి పైరు వేసుకోవడానికి రైతులు పనులు ప్రారంభిస్తున్నారు.

బీపీటీ, సన్నాలు, షుగర్ లెస్, నెల్లూరు తదితర వరి విత్తనాలను ఇప్పటికే ఇంటికి చేర్చుకున్నారు. చెరువుల కింద ఉన్న పొలాలను దుక్కులు దున్ని తర్వాత వరి నార్లు పోయనున్నారు. కాల పరిమితిని బట్టి నాట్లు వేసుకోవాల్సి వస్తుందని రైతులు తెలిపారు. మరిన్ని వర్షాలు కురిస్తే నియోజకవర్గంలోని అన్ని చెరువుల అలుగులు పారుతాయని రైతులు చెబుతున్నారు. చెరువుల్లో ఉన్న నీటిని కాపాడుకునే ప్రయత్నం రైతులు చేస్తున్నారు.


నీటితో కళకళలాడుతున్న మంగంపేట చెరువు


శెట్టిగుంట చెరువు

ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు


కనువిందు చేస్తున్న వెలుగొండ అడవుల్లోని జలపాతం

ఇటీవల కురిసిన వర్షాలతో రైల్వేకోడూరు ప్రాంతంలో ప్రకృతి అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. చిట్వేలి మండలంలో పెద్ద చెరువు అయిన ఎల్లమరాజుచెరువు కొండల మధ్య ఉంది. అక్కడ ప్రకృతి సోయగం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పారుతున్న అలుగు దృశ్యం చూపరులకు మరింత ఆనందాన్ని కల్గిస్తోంది. వెలుగొండ అడవుల నుంచి వచ్చిన వరద నీరు చెరువులోకి చేరింది. దీంతో చెరువు మొత్తం నిండి అలుగు పారుతోంది. అయ్యప్పస్వామి భక్తులు స్నానమాచరించడానికి వీలుగా మారింది. అలాగే వై.కోట గుండాలకోన, చిట్వేలి మండలం లోని పెద్దూరుకు సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్కటేశ్వరుడి గుండాల కోన వద్ద జలపాతాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. కొండకోనల్లో జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి.

సమస్యల పరిష్కారంలో
అలసత్వం వద్దు : అదనపు ఎస్పీ


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీసు అధికారులు ఏమాత్రం అలసత్వం వహించరాదని, చట్ట పరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి స్పష్టం చేశారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు ఇచ్చిన అర్జీలపై తక్షణమే విచారణ జరిపి న్యాయం అందించాలని సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ప్రధానంగా దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అంతేగాక సమస్యలను తెలియజేసేందుకు జిల్లా కేంద్రానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను దగ్గరలోని పోలీసుస్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా ఇవ్వవచ్చునని, వాటిని కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో న్యాయం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

సర్వే చేసేందుకు డబ్బు అడుగుతున్నారు

పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు


పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ కళ్యాణికి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూసర్వే అంటేనే సర్వే అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. డబ్బు లేనిదే సర్వే చేయమంటూ అధికారులు తెగేసి చెబుతున్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదులే ఇందుకు తార్కాణం. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ కళ్యాణి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కలికిరికి చెందిన టి.బావాజీకి ఆరెకరాల భూమి ఉండగా అందులో ఐదెకరాలు అగ్రికల్చర్ కాలేజీకి భూసేకరణ కింద తీసుకున్నారు. మిగిలిన ఎకరా భూమిని చూపివ్వాలని ఏళ్ల తరబడి తిరుగుతున్నా అధికారులు కనికరించలేదు. ప్రస్తుతం బావాజీకి మిగిలిన ఎకరా భూమి సర్వే చేయించి చూపించడానికి కలికిరి సర్వేయర్ రెడ్డెప్ప రూ.20 వేలు లంచం అడుగుతున్నాడని బాధితుడు బావాజీ సబ్ కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని బావాజీ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కురబలకోట మండలం అంగళ్లు వద్ద సర్వే నెంబర్-223లో 0.93 ఎకరాలు స్థలం ఉందని, అంగళ్లులోని చెత్త, వ్యర్థపదార్థాలను తన భూమిలో డంప్ చేస్తున్నారని, అంతేకాకుండా తన భూమిలోకి మురికినీటి కాల్వను వదిలేశారని బాధితుడు వెంకటరమణరాజు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. బి.కొత్తకోట బస్టాండులో నగర పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకుని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు గురి చేస్తున్నారని దీనివలన ప్రజలు అవస్థలు పడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు పాసుపుస్తకాలు, ఫ్రీహోల్డ్ సమస్యలు, సర్వే సమస్యలపై పలువురు సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు.

సుండుపల్లెలో పట్టపగలే చోరీ

రూ.80 వేలు, బంగారం, వెండి పట్టీలు చోరీ


బీరువా పగలగొట్టిన దృశ్యం

సుండుపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంటి తాళాలు పగలగొట్టి నగదు, బంగారం అపహరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక రెడ్డివారిపల్లె సచివాలయం ఎదురుగా నివాసముంటున్న సురేశ్ ఆదివారం మేళానికి వెళ్లగా, కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసుకుని బయటకు వెళ్లారు. వారు తిరిగి వచ్చే సరికి తలుపులకు వేసిన తాళాలతోపాటు, బీరువాను సైతం పగులగొట్టి నగలు నగదు అపహరించుకు వెళ్లారు. ఈ ఘటనలో రూ.80 వేలు నగదు, రెండున్నర తులాల బంగారం, మూడు జతల వెండి పట్టీలు అపహరణకు గురయ్యాయని సురేశ్ చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పనులు నాణ్యతగా చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అభివృద్ధి పథకాలు, పనులను త్వరితగతిన, నాణ్యతతో చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు, రాయచోటి ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఈవోపీఆర్డీలు, డ్వామా, నీటి పారుదల శాఖాధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకానికి సంబంధించి సర్వే పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించే విషయంలో కేవీపల్లి 4, బి.కొత్తకోట 3 ఆడిట్ ప్రాసెసింగ్ సరైన సమాధానాలు లేవని పాయింట్ అవుట్ అయ్యాయని, దానిని పరిశీలించాలని తెలిపారు. సర్వే ఫేస్-2 పనుల్లో జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు తలెత్తకుండా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీవో, జిల్లా వ్యవసాయ, హార్టికల్చర్, సెరికల్చర్, డ్వామా, జీఎస్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శివ..శివా.. దారిలా.. నీ దర్శనమెలా...

● నిత్యపూజస్వామి దర్శనం కోసం నీటిలో నడక


నిత్యపూజస్వామికోనకు నీటిలో నడిచి వెళుతున్న భక్తులు

సిద్దవటం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షం కారణంగా కొండ ప్రాంతాల నుంచి వర్షపునీరు భారీగా రావడంతో వంకలు సాగుతున్నాయి. మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనకు వెళ్లే ప్రధాన రహదారి పంచలింగాల గుడి సమీప ప్రాంతంలోని మూతికోన రాయికోన వద్ద వంకలు రావడంతో రహదారి కోతకు గురై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

సోమవారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా నిత్యపూజేశ్వరకోనకు తరలివెళ్లారు. పంచలింగాల గుడి వంకలో ప్రవహిస్తున్న నీటిలో నుంచే భక్తులు తమ మొక్కులు తీర్చుకోవడానికి నిత్యపూజకోన తరలివెళ్లారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎండోమెంట్ ఈవో శ్రీధర్‌ను వివరణ కోరగా వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారి మరమ్మతులు చేయించామని, మూతికోనరాయి సమీపాన దెబ్బతిన్న రహదారిని పరిశీలించి భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాథమిక దశగా పనులు చేపడతామని, వచ్చే మహాశివరాత్రి నాటికి మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూముల వేలం

నిమ్మనపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం పంచాయతీలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూములను వేలం వేయనున్నట్లు ఈవో మంజుల తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ నేలమల్లేశ్వస్వామి ఆలయానికి భక్తులు విరాళంగా ఇచ్చిన దాదాపు 15 సర్వే నెంబర్లలోని గల భూమిని మూడేళ్ల సర్వే నెంబరు-578, 600ఎ, 600బి, 581లో గల 11 ఎకరాల్లో గల మామిడి తోటలను ఏడాది కాలం లీజుకు ఇచ్చేందుకు దేవదాయశాఖ నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 27 తేదీ తవళం గ్రామంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు ఆసక్తి గల ప్రజలు రూ.వెయ్యి రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆమె తెలిపారు.

జనార్దన్‌రావు చెప్పాడు...మేం చేశాం

● నకిలీ మద్యం కేసులో కస్టడీకి ఆరుగురు నిందితులు ● మూడు రోజుల పాటు విచారణ...నేడు సిట్ అధికారుల రాక

మదనపల్లె/ములకలచెరువు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాన నిందితుడు మద్దేపల్లి జనార్దన్‌రావు చెప్పాడు...మేం అమలు చేశాం... ఎక్కువ డబ్బులకు ఆశపడి నకిలీ మద్యం తయారీలో కీలకంగా వ్యవహరించాం...ఎవరికీ అనుమానం రాకుండా నకిలీ మద్యం ఫార్ములా అమలు చేశామని ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో కీలక నిందితులైన కట్టా రాజు, బాలాజీ తెలిపారు. రాష్ట్రంలోనే సంచలనంగా మారిన నకిలీ మద్యం తయారీ కేసుకు సంబంధించి ఆరుగురు నిందితులను సోమవారం ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. నకిలీ మద్యం కేసులో నిందితులైన ఇబ్రహీంపట్నంకు చెందిన కట్టా రాజు (ఏ2), కృష్ణా జిల్లా గంగవరం మండలానికి చెందిన కొడాలి శ్రీనివాసరావు (ఏ12), బెంగళూరుకు చెందిన బాలాజీ (ఏ15), అతడి కుమారుడు సుదర్శన్ (ఏ20), జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహన డ్రైవర్ అష్రఫ్ (ఏ21), పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన చైతన్యబాబు (ఏ22)లను మూడు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో మదనపల్లె సబ్‌జైలులో ఉన్న ఆరుగురు నిందితులను ఉదయం ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకుని మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. వీరిని కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి విచారించారు. ఒక్కొక్కరిని వేర్వేరుగా విచారించి కీలక విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది. కేసులో కీలక నిందితులైన కట్టా రాజు, బాలాజీలను కోర్టు కస్టడీకి ఇవ్వడంతో వీరిని విచారించేందుకు మంగళవారం సిట్ అధికారులు మదనపల్లెకు రానున్నట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం కేసుకు సంబంధించి ఎక్సైజ్ పోలీసులు 25 మందిపై కేసు నమోదు చేయగా ఇప్పటి వరకు 21 మందిని అరెస్టు చేశారు.


వైద్య పరీక్షల అనంతరం నిందితులను ఎక్సైజ్ కార్యాలయానికి తీసుకెళ్తున్న దృశ్యం

తంబళ్లపల్లె కోర్టుకు నకిరికంటి రవి


నకిరికంటి రవి

ములకలచెరువు నకిలీ మద్యం కేసుకు సంబంధించి నిందితుడిగా ఉన్న హైదరాబాదుకు చెందిన నకిరికంటి రవిని సోమవారం పీటీ వారెంట్‌పై తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసుతో పాటు ఇబ్రహీంపట్నం కేసులో ఉన్న నకిరికంటి రవిని విజయవాడ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్న రవిపై తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. దీనికి కోర్టు అనుమతి ఇవ్వడంతో ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరచడంతో జడ్జి ఉమర్‌ఫరూక్ వచ్చే నెల 9వ తేదీ వరకు రిమాండ్‌కు ఆదేశించారు. దీంతో రవిని మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. కాగా నకిరికంటి రవి హైదరాబాదు నుంచి ములకలచెరువుకు నకిలీ మద్యం బాటిళ్లకు సంబంధించి మూతలు సరఫరా చేశాడు.

జాతీయ కబడ్డీ పోటీలకు దీపిక ఎంపిక

రాజంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న జాతీయ స్థాయి అండర్-17 కడ్డీ పోటీలకు రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని దీపిక ఎంపికకయ్యారు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆమె ప్రతిభను సెలెక్టర్లు గుర్తించారు. ఆమెను స్కూల్ చైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు అభినందించడంతోపాటు, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం, రాజంపేటకే కాక ఉమ్మడి కడపజిల్లా వాసులకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




దీపికను అభినందించి సత్కరిస్తున్న శరత్‌కుమార్‌రాజు

ప్రకృతి పందిరి...

ప్రకృతి ఎన్నో అద్భుతాలను సృష్టిస్తుంది. మొక్కలను అందంగా తీర్చిదిద్ది పందిరి వేసినట్లున్న ఈ చిత్రమే అందుకు నిదర్శనం. రాజంపేట-చిట్వేలి రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు పందిరి వేసినట్లుగా ఉన్నాయి. ఇటువైపు నుంచి అటువైపునకు కొమ్మలు కలిసిపోవడంతో ఈ దారి ఎంతో అద్భుతంగా కనిపిస్తూ వాహనదారులకు నీడను ఇస్తోంది.

-ఫొటోలు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



టమోటా ప్రాసెసింగ్‌పై ఐకార్ ఎస్సీ సబ్‌ప్లాన్ ప్రారంభం

పులివెందుల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో టమోటా ప్రాసెసింగ్ అంశంపై ఐకార్ ఎస్సీ సబ్‌ప్లాన్ ప్రాజెక్టును సోమవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మిదేవి ప్రారంభించారు. షెడ్యూల్డ్ కమ్యూనిటీ వారికి టమోటా ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులపై మెలకువలను వివరించారు. అలాగే ఉపాధి అవకాశాల గురించి శిక్షణ ఇస్తామన్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకురాలిగా ఇంజనీర్ నజ్మా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ, అగ్రికల్చర్ అండ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎం.మణి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

దువ్వూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం బాలాయపల్లె గ్రామానికి చెందిన ప్రశాంతి (20) అనే యువతి అదృశ్యమైనట్లు ట్రైనీ ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నుంచి కనిపించకపోవడంతో యువతి బంధువులు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎర్రగుంట్లలో ట్రాఫికర్



నాలుగురోడ్లలో రద్దీగా వాహనాలు



రాంగ్‌రూట్‌లో వస్తున్న ఆర్టీసీ బస్సులు

ఎర్రగుంట్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చింది. దీంతో ప్రజలకు ఎంతో అంతరాయం కలుగుతోంది. అసలే ఇరుకైన రోడ్లు ఆపై అతివేగంగా వెళ్లే భారీ, అతిభారీ వాహనాలు... ముఖ్యంగా ముద్దనూరు, వేంపల్లి రోడ్డులో దుకాణదారులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని పాదచారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

ట్రాఫిక్ కంట్రోలింగ్‌కు చర్యలు...

ట్రాఫిక్ సిగ్నల్స్ మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు సుమారు రూ.10లక్షలు ఖర్చవుతుంది. రోజూ పెట్రోలింగ్ చేస్తున్నాం. మున్సిపాలిటీ వారితో కలిసి ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ నిబంధనలను పాటించే విధంగా చర్యలు తీసుకుంటాం. రాంగ్‌రూట్‌లో వెళ్లేవారిపై, అలాగే అతివేగంగా వెళ్లేవారిపై కూడా చర్యలు తీసుకుంటున్నాం.

- విశ్వనాథరెడ్డి, అర్బన్ సీఐ, ఎర్రగుంట్ల

అంతేకాకుండా ఫుట్‌పాత్‌కు ఆనుకుని బైక్‌లు కూడా నిలపడంతో భారీ వాహనాలు వెళ్లేందుకు మరీ ఇరుగ్గా మారింది. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో నాలుగు రోడ్ల కూడలిలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నేషనల్ హైవే కావడంతో పాటు సిమెంట్ పరిశ్రమల నుంచి వచ్చే భారీ వాహనాలు నాలుగురోడ్ల కూడలి వద్ద మలుపు తిరిగేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

రాంగ్‌రూట్‌లో ఆర్టీసీ బస్సులు..

నాలుగు రోడ్ల కూడలికి సమీపంలో ఉన్న ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సర్కిల్‌ను తిరిగి వెళ్లాలి. కానీ అలా కాకుండా నేరుగా ప్రొద్దుటూరు వైపు వున్న బ్రిడ్జిపైకి వెళుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముద్దనూరు వైపు నుంచి, ప్రొద్దుటూరు వైపు నుంచి, కడప వైపు నుంచి వచ్చే వాహనాలన్నీ ఆగిపోతున్నాయి. దీంతో ఉదయం రద్దీ సమయంలో, సాయంత్రం 6-8గంటల ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆర్టీసీ బస్సులను రైట్‌రూట్‌లో మళ్లించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలను పట్టించుకోకపోవడంతో వారి తీరులో మార్పు రావడంలేదు.

కలగానే ట్రాఫిక్ సిగ్నల్స్..

ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు ఇప్పటివరకు కలగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు రూ.6లక్షలు పెట్టి సర్కిల్‌ను తూర్పువైపు జరిపి నిర్మించారు. అయితే సర్కిల్‌కు నాలుగువైపులా ఉన్న ఆక్రమణలను సక్రమంగా తొలగించడంలో విఫలమయ్యారు. దీంతో లక్షలు వెచ్చించినా ఎలాంటి ఉపయోగం లేదు. ఆక్రమణలు తొలగించిన రెండూ వైపులా మళ్లీ ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. నాలుగు రోడ్ల చుట్టూ జరిగిన ప్రమాదాలకు కొందరు బలైపోయారు.

పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేందుకే బాలోత్సవం

● డిసెంబరు 25లోగా పేర్లునమోదు చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సృజనాత్మతకత, ప్రతిభను వెలికి తీసేందుకే బాలోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు వి.నాగమునిరెడ్డి, అధ్యక్షుడు బి.గోపాల్ తెలిపారు. సోమవారం నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో డిసెంబరు 29, 30వ తేదీల్లో జరగనున్న కడప బాలోత్సవం-2025 సన్నాహాలకు సంబంధించి వారు విలేకరులతో మాట్లాడారు. ఈ బాలోత్సవంలో చిత్రలేఖనం, నృత్యం, కథలు, వ్యాసరచన, కవితలు, నాటికలు, విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలు వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనదలచిన విద్యార్థులు డిసెంబరు 25లోపు పాఠశాలల ద్వారా గూగుల్ లింక్‌లో నమోదు చేసుకోవాలని, స్పాట్ రిజిస్ట్రేషన్ ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు వీర సుదర్శన్‌రెడ్డి, సభ్యులు కుమారస్వామి రెడ్డి, రవి, శ్రీనివాసులరెడ్డి, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, శివరామ్ పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగాచార్యులు

కడప రూరల్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ చెందిన పంచాయతీరాజ్ ఉద్యోగులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఈ రంగాచార్యులు డిమాండ్ చేశారు. సోమవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్సీ భవనంలో జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీవిరమణ చెందిన పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పీఆర్సీ కమీషన్ నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆలపాటి ముకుందరెడ్డి, జోనల్ కో-ఆర్డినేటర్ హబీబ్, అడ్వైజర్ డాక్టర్ వెంకటేశ్, కార్యదర్శి వెంకటరమణయ్య, ఉపాధ్యక్షుడు కేశవులు పాల్గొన్నారు.

యురేనియం మైన్స్‌లో కొత్త లేబర్ కోడ్స్ అమలు చేయాలి



లేబర్‌కోడ్స్ కరపత్రాలను చూపుతున్న గని కార్మికులు

పులివెందుల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎం.తుమ్మలపల్లె వద్దనున్న యురేనియం మైన్స్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్స్‌ను అమలు చేయాలని నెల్లూరు రీజియన్ గనుల భద్రత అధికారి కిషోర్‌కుమార్ డోకుపర్తి పేర్కొన్నారు. సోమవారం యురేనియం మైన్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భద్రత, ఆరోగ్యం, సంక్షేమంపై పాటించాల్సిన విధివిధానాలను ఆయన వివరించారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. ప్రసూతి సమయంలో 26వారాల వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరికి వార్షిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అంతర్‌రాష్ట్ర వలసకార్మికులకు సంబంధించిన సోషల్ సెక్యూరిటీ బెనిఫిట్స్ వివరించి చర్చించారు. అనంతరం నాలుగు లేబర్‌కోడ్స్‌కు సంబంధించిన కరపత్రాలను గని కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, వెల్ఫేర్ ఆఫీసర్ తారక్, ఎస్ఎంఎస్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు మహాసభలను జయప్రదం చేయాలి

ప్రొద్దుటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 3, 4, 5వ తేదీలలో అమరావతిలో నిర్వహించే మూడవ ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని కవయిత్రి షేక్ పీర్ల ఆయేషా తెలిపారు. సోమవారం స్థానిక మాంటిసోరి హైస్కూలులో ప్రపంచ తెలుగు మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతుల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో కవులు, రచయితలు, మేధావులు, ఉపాధ్యాయులు విద్యార్థులు, భాషాభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనాథ్‌రెడ్డి, నర్మద్, హైదర్, కుమారి, సాయితులసి, సుజాత, మునీశ్వరి, విజయలక్ష్మి, సంధ్య, స్వర్ణ పాల్గొన్నారు.

27న దివ్యాంగులకు పారా స్పోర్ట్స్

కడప స్పోర్ట్స్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ (డిశంబర్-3) సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలోని దివ్యాంగులను ప్రోత్సహించాలనే ధ్యేయంతో స్పోర్ట్స్ వీసీ అండ్ ఎండీ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (విజయవాడ) ఆదేశాల మేరకు ఈనెల 27వ తేదీ గురువారం కడప డీఎస్ఏ స్టేడియంలో పారా స్పోర్ట్స్ నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో గౌస్‌బాష తెలిపారు. ఇందులో బ్యాడ్మింటన్ క్రీడా విభాగంలో బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్ పోటీలుంటాయన్నారు. అలాగే అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్, డిస్క్‌త్రో, చెస్ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు, రన్నర్స్‌కు పతకాలు, సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి

జమ్మలమడుగు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో దానవులపాడు గ్రామం పుల్లమ్మ మోరీ వద్ద సోమవారం రాత్రి ఇన్నోవా కారు, స్కూటరును ఢీకొనడంతో స్కూటరిస్టు ఆవుల బాలయ్య (56) దుర్మరణం చెందాడు. దానవులపాడు నుంచి ద్విచక్ర వాహనంలో చలివెందుల గ్రామానికి బయలుదేరిన బాలయ్య పుల్లమ్మ మోరీ వద్దకు రాగానే ప్రొద్దుటూరు వైపు నుంచి వచ్చిన ఇన్నోవా కారు ఢీకొంది. తీవ్ర గాయాలైన బాలయ్యను జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు కలరు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య

కొండాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత కొండాపురం గ్రామానికి చెందిన సోమలరామమోహన్‌రెడ్డి (41) అనే యువ రైతు అప్పుల బాధ తాళలేక సోమవారం రాత్రి ఏడు గంటల ప్రాంతల మృతి చెందాడు. స్థానికులు, ఆయన బంధువుల కథనం మేరకు రామమోహన్‌రెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా 3.5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడులు కూడా రాక, వరుసగా నష్టాలు రావడంతో అప్పులపాలయ్యాడు. అప్పుల వాళ్ల ఒత్తిడి ఎక్కువ అవడంతో తీవ్ర మనస్తాపనికి గురై ఇంట్లో ఎవరూ లేనిది గమనించి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్యతో పాటు ఇతద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన కుటుంబానికి తగిన ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ఎంపీటీసీ లక్ష్మిప్రసన్న, కూటమి నాయకులు చామల విష్ణువర్ధన్‌రెడ్డి, బాబురెడ్డిలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

● ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మిదేవి

పులివెందుల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మిదేవి అన్నారు. సోమవారం పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం ఆధ్వర్యంలో అంతర కళాశాలల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మిదేవి, గౌరవ అతిథిగా అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి, ప్రత్యేక అతిథిగా కడప జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ షేక్ గౌస్‌బాష హాజరై పావురాలు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని, తద్వారా శారీరక-మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. అనంతరం బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. 19 కళాశాలలకు చెందిన జట్లు పాల్గొన్న ఈ పోటీలు ఉత్కంఠగా సాగాయి. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు, పులివెందుల కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, తదితరులు పాల్గొన్నారు.





పోటీలను ప్రారంభిస్తున్న ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదాజయలక్ష్మిదేవి.. బాస్కెట్ బాల్ జట్లతో అధికారులు, పీడీలు

కోర్టుకు బంగారు వ్యాపారులు



తనికంటి శ్రీనివాస్, వెంకటస్వామిని కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బంగారు వ్యాపారులు తనికంటి శ్రీనివాస్, తనికంటి వెంకటస్వామిలను హైదరాబాద్ వ్యాపారి హేమంత్ శర్మ పెట్టిన కేసులో త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఫస్ట్ ఏడీఎం కోర్టు జడ్జి సురేంద్రనాథ్‌రెడ్డి ఎదుట హాజరుపరిచారు. సీఐ తిమ్మారెడ్డి, మరికొందరు పోలీసులు శుక్రవారం రాత్రి తమను కిడ్నాప్ చేసి ఓ ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో అక్రమంగా నిర్బంధించి తీవ్రంగా కొట్టారని, అప్పులు చెల్లించాలని తుపాకీతో బెదిరించారని నిందితులు జడ్జి ముందు వెల్లడించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి కాలు, చేతులకు అయిన గాయాలను చూపెట్టారు. తనికంటి శ్రీనివాస్ ఇంటికి వచ్చి ఆస్తిపత్రాలు, బంగారు దుకాణం తాళాలు సీఐలు తిమ్మారెడ్డి, వేణుగోపాల్, మరో పోలీసు అధికారి వసంత్ వచ్చి బలవంతంగా తీసుకెళ్లే సీసీ ఫుటేజ్ ఫోటోలు సైతం జడ్జి ముందు పెట్టారు. సోదరులిద్దరి స్టేట్‌మెంట్‌ను జడ్జి రికార్డు చేశారు. అనంతరం వెంకటస్వామి గాయాలపై స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి అడ్వకేట్ సమక్షంలో వైద్యపరీక్షలు చేయించాలని జడ్జి ఆదేశించారు. దీంతో వెంకటస్వామిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుండి వైద్యుల నివేదిక వచ్చాక ఈకేసును విచారించి కేసు విషయంలో పోలీసులు అనుసరించిన వ్యవహార శైలిపై జడ్జి నిర్ణయం తీసుకోనున్నట్లు కోర్టు వర్గాలు వెల్లడించాయి.

సివిల్ పంచాయితీలకు అడ్డాగా పోలీసుస్టేషన్లు

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు



ప్రొద్దుటూరు, నవంబరు 24(ఆంధ్ర జ్యోతి): ప్రొద్దుటూరులో పోలీసుస్టేషన్లు సివిల్ పంచాయితీలకు అడ్డాగా మారాయని, డబ్బుల సెటిల్‌మెంట్ల కోసం ఏకంగా పోలీసులే వ్యాపారులను కిడ్నాప్‌లు చేసి అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు విమర్శించారు. సోమవారం స్థానిక బీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలాగానే కూటమి ప్రభుత్వంలో కొందరు పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. తనికంటి శ్రీనివాస్ బంగారు వ్యాపార లావాదేవీల్లో బాకీలు ఉంటే కేసు నమోదు చేసి చట్టబద్ధంగా అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. కానీ ప్రొద్దుటూరులో సీఐ తిమ్మారెడ్డి ఏకంగా వ్యాపారిని కిడ్నాప్ చేసి తుపాకీ గురి పెట్టి బెదిరించి ఇంటికెళ్లి కోట్ల విలువైన ఆస్తిపత్రాలు, బంగారు దుకాణం తాళాలు తీసుకెళ్లడం పోలీసు డ్యూటీ అంటారా? గూండాయిజం అంటారో తెలపాలన్నారు. వ్యాపారుల్లో బీసీపై ఈ తరహాగా పోలీసులు అమానుషంగా వ్యవహరించడంపై బీసీ సంఘాల పక్షాన పోలీసుల చట్టవ్యతిరేక చర్యలపై పోరాడతామన్నారు. సీఐ తిమ్మారెడ్డి, అతనికి సహకరించి కిడ్నాప్‌లో పాల్గొన్న మరో ఎస్ఐ, కానిస్టేబుళ్లపై కూడా చర్యలు తీసుకోవాలని, లేకుంటే పోలీసుల గూండాయిజం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సమాఖ్య కార్యదర్శి దస్తగిరి, కోశాధికారి మడక సంటెన్న పాల్గొన్నారు.

స్థల వివాదంపై పరస్పర దాడులు

అట్లూరు నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అట్లూరు క్రాస్ రోడ్డు సమీపంలో అయ్యప్పగుడి వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థల వివాదంపై ఇరువురు పరస్పర దాడులు చేసుకోవడంతో ఇరువురికి గాయాలై కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. అయ్యప్ప గుడి వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆరు సెంట్లను 2023లో తమ్మినేని సుబ్బలక్ష్మి, తమ్మినేని శివప్రసాద్, వాసు హరిక్రిష్ణ పేర్లతో అనుబంధం పత్రాలను అప్పటి తహసీల్దారు ఇచ్చారు. ఈ క్రమంలో నెలరోజులక్రితం ఆ స్థలంలో ఇసుక, రాళ్లు తోలడం జరిగింది. సోమవారం ఎక్సకవేటరుతో వెళ్లి బేస్‌మట్టం నిర్మించేందుకు గాడి తీస్తుండగా ఆలయ నిర్వాహకుడు నరసింహారెడ్డి అడ్డుపడి ఈ స్థలం అయ్యప్పస్వామి గుడి స్థలం అంటూ రెడ్డిపల్లె గ్రామానికి చెందిన అంజనేయులుతో ఘర్షణకు దిగారు. దీంతో నరసింహారెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. అంజనేయులుకు వెన్నెముక, చేయి, ఎముకలు విరిగినట్లు స్థానికులు తెలిపారు. తోటి అయ్యప్ప భక్తుడైన నరసింహారెడ్డికి గాయాలు కావడంతో అయ్యప్ప భక్తులంతా రోడ్డుపై బైఠాయించారు. వెంటనే ఎస్ఐ రామక్రిష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రమణ, వీఆర్వో నాని సంఘటనాస్థలానికి చేరుకుని అయ్యప్ప భక్తులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించి రెవెన్యూ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. రిమ్స్‌లో చికత్స పొందుతున్న వారిపూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అక్రమాలపై విచారణ

- ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో కదిలిన డీఐజీ
- నలుగురు స్టాంప్‌వెండర్ల లైసెన్సులు సస్పెన్షన్.. స్టాకు స్వాధీనం
- దస్తావేజు లేకర్ల అక్రమ వసూళ్లు, ఆగడాలపై ఫిర్యాదుల వెల్లువ

బి.కొత్తకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై సోమవారం ఉన్నతస్థాయి విచారణ ప్రారంభమైంది. కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నారని, లంచం ఇస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని బాధితులు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కమిషనర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ రిజిస్ట్రేషన్ స్టాంప్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు కడప డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ రామలక్ష్మి పట్నాయక్ సోమవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టారు. బాధిత రైతులు, ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పనితీరు, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ విక్రేతలపై అధికవసూళ్లు, అక్రమాలపై రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కార్యాలయంలో డాక్యుమెంట్‌రైటర్ల రాజ్యం నడుస్తోందని, తమను ఆశ్రయించిన రైతులకు మాయమాటలు చెప్పి, రిజిస్ట్రేషన్లపై కొర్రీలు పెట్టి, కుంటిసాకులతో పెద్దమొత్తంలో సొమ్ము దోచుకుంటున్నారని, ప్రజల సొమ్మును రిజిస్ట్రార్, సిబ్బంది డాక్యుమెంట్ రైటర్లు పంచుకుంటున్నారని జనం ఏకరువు పెట్టారు. జనం, రైతులు ఏకపక్షంగా ఫిర్యాదులు చేయడంతో డీఐజీ విస్తుపోయారు.

అక్రమాలు వాస్తవమే...

బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 1శాతం లంచం తీసుకుంటున్నారు, డాక్యుమెంట్ రైటర్ల హవా నడుస్తోంది. రిజిస్ట్రేషన్లు స్లాట్‌బుకింగ్ ద్వారా జరగడం లేదు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే డాక్యుమెంట్ రైతులకు ఇవ్వడం లేదని విచారణలో తేలినట్లు కడప డీఐజీ పేర్కొన్నారు. పబ్లిక్‌ను లోనికి రానివ్వకుండా డాక్యుమెంట్ రైటర్లు అన్నీ తామై కార్యాలయ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు తేలిందన్నారు. డాక్యుమెంట్‌రైటర్లు బయట చేసే వ్యవహారాలతో తమకు సంబంధం లేదని రిజిస్ట్రార్ చెబుతున్నప్పటికీ సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, స్లాట్ బుకింగ్ ఎప్పుడైంది, డాక్యుమెంట్ ఎప్పుడిచ్చారు అనే వివరాలను జిల్లా కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులకు రిపోర్టు పంపుతామని డీఐజీ తెలిపారు.

నలుగురి లైసెన్సులు సస్పెండ్

స్టాంపులను ఇష్టారాజ్యంగా విక్రయించడంతో పాటు, దస్తావేజు లేకర్లుగా ద్విపాత్రాభినయం చేస్తూ రైతులను మోసం చేస్తున్న నలుగురు స్టాంప్‌వెండర్ల లైసెన్సులు సస్పెండ్ చేస్తున్నామని, వారి వద్ద ఉన్న స్టాకును సైతం స్వాధీనం చేసుకోవాలని ఆదేశించినట్టు డీఐజీ పేర్కొన్నారు. కాగా ఆరోపణలపై డీఐజీ అడిగిన ప్రశ్నలకు రిజిస్ట్రార్ సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారు. తమ భూములకు సంబంధించి తప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగాయని వాటిని రద్దు చేయాలని బాధితులు లిఖితపూర్వక ఫిర్యాదులు చేయగా, వాటిపై విచారణ చేయించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె హామీనిచ్చారు.

పెన్షనర్లకు ట్రెజరీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్

రాజంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల సౌక ర్యార్థం రాజంపేట డివిజనల్ ట్రెజరీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ట్రెజరీ అధికారి రవిశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ వయోవృద్ధులైన పెన్షనర్ల సౌక ర్యార్థం ప్రత్యేకకౌంటర్‌ను ఏర్పాటు చేయాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య తది తరులు విన్నవించడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నా మన్నారు. జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 28 వరకు పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పిం చాల్సి ఉందన్నారు. జీవన్ ప్రమాణ్ వెబ్‌సైట్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లను నమోదు చేసుకోవచ్చు నన్నారు. కాబట్టి పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. రాజంపేట ఎన్జీవో హోంలోనూ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారన్నారు.

భవిష్యత్తులో ప్రతి ఇంటికీ వెలిగల్లు నీరు

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలో ని ఏజీ గార్డెన్‌లో ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేసి తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించడంతోపాటు రోడ్లు, డ్రైనేజీలు తదితర సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఏజీ గార్డెన్‌లో వేసిన బోరును టీడీపీ నాయకుడు మడితాటి శ్రీనివాసులరెడ్డితో కలిసి ప్రారంభించారు. 2 ఇంచుల నీరు పడడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో బోరు వేసి మోటారు బిగించి నీరు విడుదల చేశామన్నారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాయచోటికి దూరంగా ఉన్న గొల్లపల్లి, ఏజీ గార్డెన్, చెన్నముక్కపల్లె ప్రాంతాలకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రతి ఇంటికి వెలిగల్లు నీరు అందించేందుకు 70 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.


తాగునీటి బోరును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మహిళల సమస్యలు విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భం గా మంత్రికి ఏజీ గార్డెన్ ప్రజలు గజమాల తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాయుడుకాలనీ టీడీపీ నాయకుడు రంజిత్, గణేశ్, పలువురు టీడీపీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మట్టి శ్రీనివాసులు నాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు పెట్టుబడి సాయం.. ధాన్యానికి మద్దతు ధర

● చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పెట్టుబడి సాయంతో పాటు.. ధాన్యా నికి గిట్టుబాటు ధర కల్పించి తీరుతామని రాజం పేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు తెలిపారు. సోమవారం రాజంపేట మం డలంలోని వరదయ్యగారిపల్లెలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌యోజన పథకం లబి దారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయ న మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించే పంటలపై అధికారులు అవగాహన కల్పించాలని, ఏ పంటకు ఏయే ఎరువులు వాడాలో రైతులకు ఎప్పటి కప్పుడు వ్యవసాయాధికారులు సూచనలు చేయాలన్నా రు. వ్యవసాయ, ఉద్యాన అధికారులు సూచించిన ఎరువులను వాడి మేలురకమైన పంటలను పండిస్తే ప్రభుత్వం, గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రవికుమార్ నా యుడు, పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మాజీ అధ్యక్షుడు బాపనయ్య నాయుడు, సుబ్రమ ణ్యం నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి సతీష్ కుమార్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

లక్కిరెడ్డిపల్లె: రైతును రాజును చేసేది టీడీపీ ప్రభుత్వం మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగోళ్ల రెడ్డెయ్య యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్ యండీ షఫీనాయక్ అన్నారు. రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం దప్పేపల్లి, దిన్నెపాడు, మద్దిరేవుల గ్రామా ల్లో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఏవో రాజకుమారి, హెచ్‌వో సింధూరి, నాయకులు షేక్. ఆరీఫ్, శంకారపు జయరాం, బాబుల్ రెడ్డి, సర్పంచ్ కేశ వులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సుండుపల్లె: వ్యవసాయశాఖ కార్యాలయం లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఏవో మహబూబ్‌బాషా, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, టీడీపీ సీనియర్ నాయకులు అమర్‌నాథ రెడ్డి, క్లస్టర్ కన్వీనర్ ఎల్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని కొత్తపల్లిలో వ్యవసాయ అనుబంధ రంగాలు, అగ్రికల్చర్ అధి కారులతో కలిసి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేశ్‌రెడ్డి నాయకులు అయోధ్యాపురం ప్రతాప్‌రెడ్డి, గంప సుబ్బ రాయుడు, దేరంగుల శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, సూరం శివారెడ్డి, కదిరి రామాంజులు పాల్గొన్నారు.

సిద్దవటం: వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యం లో జంగాలపల్లెలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వ హించారు. మండల ప్రత్యేక అధికారి జయసింహా, జిల్లా పట్టుపరిశ్రమశాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దశరథనాయుడు, మండల అభివృద్ధి అధికారి ఫణిరాజకుమారి, వ్యవసాయ ఏఈవో ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండలంలోని ఓబిలి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో టీడీపీ ఇన్‌చార్జి ఎస్.అమీరుల్లా అధ్యక్షతన అన్నదాత సుఖీభవ కరపత్రాలను పంపిణీ చేశారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలో బీసీ నేతలతో మాట్లాడుతూ రిజర్వేషన్ల అంశం నిర్ధారణ కాకుండానే ఎన్నికలు నిర్వహిస్తే జనాభాలో 56 శాతం గల బీసీలకు అపార నష్టం కలుగుతుందన్నారు. గత ఎన్నికల్లో చట్టంలో తెలిపిన 34 శాతం కాకుండా 24 శాతానికి పడిపోయిన సంగతి ప్రభుత్వానికి తెలుసన్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎసీల జనాభా కొంత పెరిగి ఉంటుందని, ఫలితంగా బీసీలు అదనంగా నష్టపోతారన్నారు. దీనికి తోడు ఉన్నత న్యాయస్థానాలు బీసీలకు నష్టపరమైన రాజ్యాంగ వ్యతిరేక తీర్పుల ద్వారా రిజర్వేషన్లు 50 శాతం సీలింగ్‌కు మించరాదని పట్టుబడుతున్న విషయం మహారాష్ట్ర కేసులో సుప్రీం కోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు ద్వారా అర్థమవుతోందన్నారు. జనగణనతో పాటు కులగణన చేయాలని, బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, బీసీలను ఏబీసీడీలుగా విభజించాలని, మహిళా రిజర్వేషన్లు పరిశీలించాలన్నారు. శాసన మండలి, రాజ్యసభ ఎన్నికల్లో కూడా బీసీలకు అవకాశం కల్పించి బీసీల రక్షణ చటాన్ని తక్షణమే తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా గౌరవ సలహాదారు కేవీ రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వరయ్య, జిల్లా సెక్రటరీ ఖాజావలి, యువజన సంఘం కార్యదర్శి వెంకటేశ్, రాయచోటి నియోజకవర్గ అధ్యక్షులు ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

తాగునీటి సమస్య పరిష్కారంలో ఆర్‌డబ్ల్యూఎస్ ముందుండాలి

● ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా

రైల్వేకోడూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యల పరిష్కారంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందుండాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో తాగునీటి పథకాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు విజయ్, మహేశ్వర, ఏఈలు రమేష్, సుబ్రహ్మణ్యం, గిరిధర్, సునీల్, దినేష్, రాజేష్, రమణ, సీనియర్ అసిస్టెంట్ మంజుల, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోనమ్మ చెరువు వద్ద గంగమ్మకు జలహారతి

పుల్లంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోనమ్మ చెరువుకు నీరు చేరడంతో సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా చెరువులు ఆక్రమిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ముక్కా వరలక్ష్మి, ఏఈఈ నాగేంద్ర, తహసీల్దారు పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభం

మండల పరిధిలోని పీవీజీపల్లెలో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలూరు చంద్రకళ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే భూ సమస్యల పరిష్కారం : సీపీఐ

రైల్వేకోడూరురూరల్, నవం బరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ఉద్య మాలకు సిద్ధం కావాలని జిల్లా సీపీఐ కార్యదర్శి పి. మహేశ్, వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప తెలిపారు. సోమ వారం రైల్వే కోడూరు ఎర్రచందనం పార్కులోని మండపంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దళితులు, గిరిజనులకు మిగులు భూములను ఇవ్వాలన్నారు. కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయాలన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు పేదల భూముల పరిరక్షణలో చోద్యం చూస్తున్నారని తెలిపారు. పుల్లంపేట మండలంలో ఆక్రమణలు తార స్థాయిలో ఉన్నాయన్నారు. భూ బకాసురులు కబ్జాలు చేసినా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అసైన్డ్ కమిటీ సమావేశం నిర్వ హించి నియోజకవర్గంలో ఉన్న పేద, బలహీన, బడుగు వర్గాలకు వ్యవసాయ భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య, నాయకులు మల్లిక వెంకటరమణ, వెలుగు లక్షుమ్మయ్య, అజిమాబీ, వెంకటరమణ, వెలుగు మణి, రవి, శివకుమార్‌రాజు పాల్గొన్నారు.



28న రామాపురం మండల సమావేశం

రామాపురం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సభాభవనంలో ఈ నెల 28న ఉదయం మండల అధ్యక్షురాలు గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాషువా తెలిపారు. ఈ సమావేశంలో సాగునీరు, విద్యుత్, ఉపాధి, వైద్య ఆరోగ్యం, పశుసంవర్ధక శాఖ, హౌసింగ్, వ్యవసాయం, నాడు- నేడు తదితర శాఖలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

26 న లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వ హిస్తున్నట్లు ఎంపీడీవో రెడ్డియాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి మంత్రి మం డిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు అన్నిశాఖల అధికారు లు బుధవారం పది గంటలకు హాజరుకావాలని ఆయన తెలిపారు.

ఖాదర్‌వలి ఉరుసుకు చమర్తికి ఆహ్వానం

నందలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలో ఈ నెల 28న నిర్వహించనున్న హజరత్ ఖాదర్‌వలి 134వ ఉరుసుకు రాజంపేట తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజును దర్గా కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం బీసీసెల్ వైస్ ప్రెసిడెంట్ తాటి సుబ్బరాయుడు, దర్గా కమిటీ అధ్యక్షుడు కమాల్‌బాషా, మాజీ జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్, బీజేపీ జిల్లా సమన్వయకర్త కోడూరు ఆదినారాయణ, కరిముల్లా, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలి

వీరబల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సేవాభావాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్ఎస్ అధికారులు రఘు రామయ్య, భాస్కర్ సూచించారు. సోమవారం స్థానిక కళాశాలలో ఎన్‌ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భం గా ప్రిన్సిపాల్ అజంతుల్లా మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని స్వచ్ఛందంగా సేవ చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రోగ్రాం ఆఫీసర్ జీ. రఘురామయ్య మాట్లాడుతూ ఇలాంటి శిబి రాలతో విద్యార్థుల్లో ఐక్యత, నాయకత్వ లక్షణాలు, సేవా భావం అలవడుతాయన్నారు. అధ్యాపకులు శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రశేఖర్, చంద్ర శేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రఘురామయ్య

'సమస్యల పరిష్కారమే ఎస్‌ఎఫ్ఐ ధ్యేయం'

రైల్వేకోడూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పోరాడుతున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సర్వేపల్లి నరసింహ, డీవీ రమణ తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల సందర్భంగా సోమవారం రైల్వేకోడూరు పట్టణంలో లోగో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాటాలు చేసి విజయాలు సాధించినట్లు వివరించారు. విద్యాసంస్థలు నెలకొల్పడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను విద్యార్థులకు తెలియజేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందిస్తున్నామన్నారు. ఏ చిన్న సమస్య వచ్చిన వెంటనే స్పందించి యాజమాన్యాలతో చర్చిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపుస్మా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ కుమార్, కంచిరాజు చంగల్‌రాజు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు అదునుకోట గోపీనాథ్, సుకుమార్, శ్రీనివాసులు, ముఖేష్, లక్ష్మీప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి లతీఫ్, నాయకులు ఎన్. జగదీష్, జి. మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి మండల ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

వీరబల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా టీ. సుధాకర్ రెడ్డిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయచోటిలోని డైట్ పాఠశాలలో రాష్ట్ర పరిశీలకుడు వై. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఆర్. రఘు ప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా ఎం. చంద్రమౌళితోపాటు కార్యవర్గాన్ని, జిల్లా కౌన్సిలర్లుగా రామాంజుల్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డిని ఎన్నుకున్నారు. అనంతరం సుధాకర్‌రెడ్డి, రఘుప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అందుబాటులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


సుధాకర్, రఘుప్రసాద్

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

రాజంపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలంటూ వీఆర్‌ఏ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సీహెచ్‌చంద్రశేఖర్, సీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గౌరవ వేతనం పేరుతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందని ఆరో పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తవుతున్నా సమస్యలు పరిష్కరించకపోవడం సరికాదన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావనకు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొరముట్ల సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, డివిజన్ కార్యదర్శి మధు, మల్లి, సుబ్బరాయుడు, చక్రపాణి, తిరుపాల్, నరసింహులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏ లు

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

రాజంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భువనగిరి పల్లెకు చెందిన జన సైనికుడు కోలాటం నరసింహ, సుజాత దంపతుల కుటుంబీకులకు జనసేనపార్టీ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున రూ.10 లక్షలు బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం విజయ వాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో అందజేశారు. జనసేన సభ్యత్వం తీసుకుని బీమా చేయించుకున్నారు. వారు ప్రమాదంలో మరణించిన విషయాన్ని రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ, దినేష్ అధిష్టా నం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. భువనగిరిపల్లె నాయకులు, బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు టైల్స్ నరసింహా, హరి పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

వీరబల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మట్లి పంచాయతీ గంగాపురంలో తాగునీటి బోరు చెడిపోయిందంటూ గ్రామస్తులు సర్పంచ్ నాగార్జునచారికి ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన సోమవారం బోరుకు మరమ్మతులు చేయించారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది.

రాజంపేట రూరల్ సీఐగా మస్తాన్



రాజంపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట రూరల్ సీఐగా సోమవారం ఏపీ మస్తాన్ బాధ్యతలు చేపట్టారు. గతంలో గుంతకల్ టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో పనిచేశారు. ఇక్కడ పనిచేసిన బీవీ రమణను అనంతపురం జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. సర్కిల్ పరిధిలోని పుల్లంపేట, పెనగలూరు, నందలూరు ఎస్ఐలు, సిబ్బంది సీఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పెనగలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రంపేట ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రభుత్వ కంటి వైద్యుడు వి. చంద్ర శేఖర్ రెడ్డి 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు లేబాక గోపాలకృష్ణ తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తారని తెలిపారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఆలయ భూముల కౌలు హక్కుల వేలం

చిట్వేలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాతచిట్వేలిలోని వరదరాజస్వామి ఆలయంలో సోమవారం ఆలయ భూముల కౌలు హక్కులకు బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయానికి సంబంధించిన 19 సర్వే నంబర్లలోని 18.80 ఎకరాలకు వేలం నిర్వహించామని రాజంపేట దేవ దాయశాఖ ఈవో ఎన్.వెంకటసుబ్బారెడ్డి తెలియజేశారు. 2024-25కు 1.06 లక్షల ఆదాయం రాగా 2025-26 కు 1.36 లక్షలు ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఇన్‌స్పెక్టర్ జనార్దన్, సునీల్ పాల్గొన్నారు.

వర్షాలతో చెరువుల్లో జలకళ



● ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు

రైల్వేకోడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పలు దఫాలుగా కురిసిన వర్షాలకు చెరువులు నిండాయి. కొన్ని చెరువులు నిండుకుండలా ఉన్నాయి. మరికొన్ని చెరువులు అలుగులు పారుతున్నాయి. నియోజకవర్గంలోని మొత్తం 52 చెరువులు జలకళ సంతరించుకున్నాయి.


చెరువుల్లో నీరు చేరడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. రైతులు చెరువుల కింద వరి నాట్లు వేసుకోవడానికి సమాయత్వం అవుతున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో ఉన్న చెరువు కింద ఆయకట్టు 8 వేల హెక్టార్లలో వరి పైరు వేసుకోవడానికి రైతులు పనులు ప్రారంభిస్తున్నారు.

బీపీటీ, సన్నాలు, షుగర్ లెస్, నెల్లూరు తదితర వరి విత్తనాలను ఇప్పటికే ఇంటికి చేర్చుకున్నారు. చెరువుల కింద ఉన్న పొలాలను దుక్కులు దున్ని తర్వాత వరి నార్లు పోయనున్నారు. కాల పరిమితిని బట్టి నాట్లు వేసుకోవాల్సి వస్తుందని రైతులు తెలిపారు. మరిన్ని వర్షాలు కురిస్తే నియోజకవర్గంలోని అన్ని చెరువుల అలుగులు పారుతాయని రైతులు చెబుతున్నారు. చెరువుల్లో ఉన్న నీటిని కాపాడుకునే ప్రయత్నం రైతులు చేస్తున్నారు.


నీటితో కళకళలాడుతున్న మంగంపేట చెరువు


శెట్టిగుంట చెరువు

ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు


కనువిందు చేస్తున్న వెలుగొండ అడవుల్లోని జలపాతం

ఇటీవల కురిసిన వర్షాలతో రైల్వేకోడూరు ప్రాంతంలో ప్రకృతి అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. చిట్వేలి మండలంలో పెద్ద చెరువు అయిన ఎల్లమరాజుచెరువు కొండల మధ్య ఉంది. అక్కడ ప్రకృతి సోయగం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పారుతున్న అలుగు దృశ్యం చూపురులకు మరింత ఆనందాన్ని కల్గిస్తోంది. వెలుగొండ అడవుల నుంచి వచ్చిన వరద నీరు చెరువులోకి చేరింది. దీంతో చెరువు మొత్తం నిండి అలుగు పారుతోంది. అయ్యప్పస్వామి భక్తులు స్నానమాచరించడానికి వీలుగా మారింది. అలాగే వై.కోట గుండాలకోన, చిట్వేలి మండలం లోని పెద్దూరుకు సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్కటేశ్వరుడి గుండాల కోన వద్ద జలపాతాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. కొండకోనల్లో జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి.

సమస్యల పరిష్కారంలో
అలసత్వం వద్దు : అదనపు ఎస్పీ


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీసు అధికారులు ఏమాత్రం అలసత్వం వహించరాదని, చట్ట పరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి స్పష్టం చేశారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు ఇచ్చిన అర్జీలపై తక్షణమే విచారణ జరిపి న్యాయం అందించాలని సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ప్రధానంగా దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అంతేగాక సమస్యలను తెలియజేసేందుకు జిల్లా కేంద్రానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను దగ్గరలోని పోలీసుస్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా ఇవ్వవచ్చునని, వాటిని కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో న్యాయం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

సర్వే చేసేందుకు డబ్బు అడుగుతున్నారు

పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు


పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ కళ్యాణికి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూసర్వే అంటేనే సర్వే అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. డబ్బు లేనిదే సర్వే చేయమంటూ అధికారులు తెగేసి చెబుతున్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదులే ఇందుకు తార్కాణం. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ కళ్యాణి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కలికిరికి చెందిన టి.బావాజీకి ఆరెకరాల భూమి ఉండగా అందులో ఐదెకరాలు అగ్రికల్చర్ కాలేజీకి భూసేకరణ కింద తీసుకున్నారు. మిగిలిన ఎకరా భూమిని చూపివ్వాలని ఏళ్ల తరబడి తిరుగుతున్నా అధికారులు కనికరించలేదు. ప్రస్తుతం బావాజీకి మిగిలిన ఎకరా భూమి సర్వే చేయించి చూపించడానికి కలికిరి సర్వేయర్ రెడ్డెప్ప రూ.20 వేలు లంచం అడుగుతున్నాడని బాధితుడు బావాజీ సబ్ కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని బావాజీ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కురబలకోట మండలం అంగళ్లు వద్ద సర్వే నెంబర్-223లో 0.93 ఎకరాలు స్థలం ఉందని, అంగళ్లలోని చెత్త, వ్యర్థపదార్థాలను తన భూమిలో డంప్ చేస్తున్నారని, అంతేకాకుండా తన భూమిలోకి మురికినీటి కాల్వను వదిలేశారని బాధితుడు వెంకటరమణరాజు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. బి.కొత్తకోట బస్టాండులో నగర పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకుని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు గురి చేస్తున్నారని దీనివలన ప్రజలు అవస్థలు పడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు పాసుపుస్తకాలు, ఫ్రీహోల్డ్ సమస్యలు, సర్వే సమస్యలపై పలువురు సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు.

సుండుపల్లెలో పట్టపగలే చోరీ

రూ.80 వేలు, బంగారం, వెండి పట్టీలు చోరీ


బీరువా పగలగొట్టిన దృశ్యం

సుండుపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంటి తాళాలు పగలగొట్టి నగదు, బంగారం అపహరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక రెడ్డివారిపల్లె సచివాలయం ఎదురుగా నివాసముంటున్న సురేశ్ ఆదివారం మేళానికి వెళ్లగా, కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసుకుని బయటకు వెళ్లారు. వారు తిరిగి వచ్చే సరికి తలుపులకు వేసిన తాళాలతోపాటు, బీరువాను సైతం పగులగొట్టి నగలు నగదు అపహరించుకు వెళ్లారు. ఈ ఘటనలో రూ.80 వేలు నగదు, రెండున్నర తులాల బంగారం, మూడు జతల వెండి పట్టీలు అపహరణకు గురయ్యాయని సురేశ్ చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పనులు నాణ్యతగా చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అభివృద్ధి పథకాలు, పనులను త్వరితగతిన, నాణ్యతతో చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు, రాయచోటి ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఈవోపీఆర్డీలు, డ్వామా, నీటి పారుదల శాఖాధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకానికి సంబంధించి సర్వే పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించే విషయంలో కేవీపల్లి 4, బి.కొత్తకోట 3 ఆడిట్ ప్రాసెసింగ్ సరైన సమాధానాలు లేవని పాయింట్ అవుట్ అయ్యాయని, దానిని పరిశీలించాలని తెలిపారు. సర్వే ఫేస్-2 పనుల్లో జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు తలెత్తకుండా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీవో, జిల్లా వ్యవసాయ, హార్టికల్చర్, సెరికల్చర్, డ్వామా, జీఎస్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శివ..శివా.. దారిలా.. నీ దర్శనమెలా...

● నిత్యపూజస్వామి దర్శనం కోసం నీటిలో నడక


నిత్యపూజస్వామికోనకు నీటిలో నడిచి వెళుతున్న భక్తులు

సిద్దవటం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షం కారణంగా కొండ ప్రాంతాల నుంచి వర్షపునీరు భారీగా రావడంతో వంకలు సాగుతున్నాయి. మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనకు వెళ్లే ప్రధాన రహదారి పంచలింగాల గుడి సమీప ప్రాంతంలోని మూతికోన రాయికోన వద్ద వంకలు రావడంతో రహదారి కోతకు గురై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

సోమవారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా నిత్యపూజేశ్వరకోనకు తరలివెళ్లారు. పంచలింగాల గుడి వంకలో ప్రవహిస్తున్న నీటిలో నుంచే భక్తులు తమ మొక్కులు తీర్చుకోవడానికి నిత్యపూజకోన తరలివెళ్లారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎండోమెంట్ ఈవో శ్రీధర్‌ను వివరణ కోరగా వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారి మరమ్మతులు చేయించామని, మూతికోనరాయి సమీపాన దెబ్బతిన్న రహదారిని పరిశీలించి భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాథమిక దశగా పనులు చేపడతామని, వచ్చే మహాశివరాత్రి నాటికి మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూముల వేలం


నిమ్మనపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం పంచాయతీలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూములను వేలం వేయనున్నట్లు ఈవో మంజుల తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ నేలమల్లేశ్వస్వామి ఆలయానికి భక్తులు విరాళంగా ఇచ్చిన దాదాపు 15 సర్వే నెంబర్లలోని గల భూమిని మూడేళ్ల సర్వే నెంబరు-578, 600ఎ, 600బి, 581లో గల 11 ఎకరాల్లో గల మామిడి తోటలను ఏడాది కాలం లీజుకు ఇచ్చేందుకు దేవదాయశాఖ నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 27 తేదీ తవళం గ్రామంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు ఆసక్తి గల ప్రజలు రూ.వెయ్యి రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆమె తెలిపారు.

జనార్దన్‌రావు చెప్పాడు...మేం చేశాం

● నకిలీ మద్యం కేసులో కస్టడీకి ఆరుగురు నిందితులు ● మూడు రోజుల పాటు విచారణ...నేడు సిట్ అధికారుల రాక


వైద్య పరీక్షల అనంతరం నిందితులను ఎక్సైజ్ కార్యాలయానికి తీసుకెళ్తున్న దృశ్యం

మదనపల్లె/ములకలచెరువు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాన నిందితుడు మద్దేపల్లి జనార్దన్‌రావు చెప్పాడు...మేం అమలు చేశాం... ఎక్కువ డబ్బులకు ఆశపడి నకిలీ మద్యం తయారీలో కీలకంగా వ్యవహరించాం...ఎవరికీ అనుమానం రాకుండా నకిలీ మద్యం ఫార్ములా అమలు చేశామని ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో కీలక నిందితులైన కట్టా రాజు, బాలాజీ తెలిపారు. రాష్ట్రంలోనే సంచలనంగా మారిన నకిలీ మద్యం తయారీ కేసుకు సంబంధించి ఆరుగురు నిందితులను సోమవారం ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. నకిలీ మద్యం కేసులో నిందితులైన ఇబ్రహీంపట్నంకు చెందిన కట్టా రాజు (ఏ2), కృష్ణా జిల్లా గంగవరం మండలానికి చెందిన కొడాలి శ్రీనివాసరావు (ఏ12), బెంగళూరుకు చెందిన బాలాజీ (ఏ15), అతడి కుమారుడు సుదర్శన్ (ఏ20), జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహన డ్రైవర్ అష్రఫ్ (ఏ21), పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన చైతన్యబాబు (ఏ22)లను మూడు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో మదనపల్లె సబ్‌జైలులో ఉన్న ఆరుగురు నిందితులను ఉదయం ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకుని మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. వీరిని కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి విచారించారు. ఒక్కొక్కరిని వేర్వేరుగా విచారించి కీలక విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది. కేసులో కీలక నిందితులైన కట్టా రాజు, బాలాజీలను కోర్టు కస్టడీకి ఇవ్వడంతో వీరిని విచారించేందుకు మంగళవారం సిట్ అధికారులు మదనపల్లెకు రానున్నట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం కేసుకు సంబంధించి ఎక్సైజ్ పోలీసులు 25 మందిపై కేసు నమోదు చేయగా ఇప్పటి వరకు 21 మందిని అరెస్టు చేశారు.


నకిరికంటి రవి

తంబళ్లపల్లె కోర్టుకు నకిరికంటి రవి

ములకలచెరువు నకిలీ మద్యం కేసుకు సంబంధించి నిందితుడిగా ఉన్న హైదరాబాదుకు చెందిన నకిరికంటి రవిని సోమవారం పీటీ వారెంట్‌పై తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసుతో పాటు ఇబ్రహీంపట్నం కేసులో ఉన్న నకిరికంటి రవిని విజయవాడ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్న రవిపై తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. దీనికి కోర్టు అనుమతి ఇవ్వడంతో ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరచడంతో జడ్జి ఉమర్‌ఫరూక్ వచ్చే నెల 9వ తేదీ వరకు రిమాండ్‌కు ఆదేశించారు. దీంతో రవిని మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. కాగా నకిరికంటి రవి హైదరాబాదు నుంచి ములకలచెరువుకు నకిలీ మద్యం బాటిళ్లకు సంబంధించి మూతలు సరఫరా చేశాడు.

జాతీయ కబడ్డీ పోటీలకు దీపిక ఎంపిక


దీపికను అభినందించి సత్కరిస్తున్న శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న జాతీయ స్థాయి అండర్-17 కడ్డీ పోటీలకు రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని దీపిక ఎంపికకయ్యారు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆమె ప్రతిభను సెలెక్టర్లు గుర్తించారు. ఆమెను స్కూల్ ఛైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు అభినందించడంతోపాటు, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం, రాజంపేటకే కాక ఉమ్మడి కడపజిల్లా వాసులకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పందిరి...

ప్రకృతి ఎన్నో అద్భుతాలను సృష్టిస్తుంది. మొక్కలను అందంగా తీర్చిదిద్ది పందిరి వేసినట్లున్న ఈ చిత్రమే అందుకు నిదర్శనం. రాజంపేట-చిట్వేలి రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు పందిరి వేసినట్లుగా ఉన్నాయి. ఇటువైపు నుంచి అటువైపునకు కొమ్మలు కలిసిపోవడంతో ఈ దారి ఎంతో అద్భుతంగా కనిపిస్తూ వాహనదారులకు నీడను ఇస్తోంది.

-ఫొటోలు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



టమోటా ప్రాసెసింగ్‌పై ఐకార్ ఎస్సీ సబ్‌ప్లాన్ ప్రారంభం

పులివెందుల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో టమోటా ప్రాసెసింగ్ అంశంపై ఐకార్ ఎస్సీ సబ్‌ప్లాన్ ప్రాజెక్టును సోమవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి ప్రారంభించారు. షెడ్యూల్డ్ కమ్యూనిటీ వారికి టమోటా ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులపై మెలకువలను వివరించారు. అలాగే ఉపాధి అవకాశాల గురించి శిక్షణ ఇస్తామన్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకురాలిగా ఇంజనీర్ నజ్మా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ, అగ్రికల్చర్ అండ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎం. మణి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

దువ్వూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం బాలాయపల్లె గ్రామానికి చెందిన ప్రశాంతి (20) అనే యువతి అదృశ్యమైనట్లు ట్రైనీ ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నుంచి కనిపించకపోవడంతో యువతి బంధువులు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎర్రగుంట్లలో ట్రాఫికర్



నాలుగురోడ్లలో రద్దీగా వాహనాలు



రాంగ్‌రూట్‌లో వస్తున్న ఆర్టీసీ బస్సులు

ఎర్రగుంట్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చింది. దీంతో ప్రజలకు ఎంతో అంతరాయం కలుగుతోంది. అసలే ఇరుకైన రోడ్లు ఆపై అతివేగంగా వెళ్లే భారీ, అతిభారీ వాహనాలు... ముఖ్యంగా ముద్దనూరు, వేంపల్లి రోడ్డులో దుకాణదారులు పుట్‌పాత్‌ను ఆక్రమించుకుని పాదచారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

ట్రాఫిక్ కంట్రోలింగ్‌కు చర్యలు...

ట్రాఫిక్ సిగ్నల్స్ మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు సుమారు రూ.10లక్షలు ఖర్చవుతుంది. రోజూ పెట్రోలింగ్ చేస్తున్నాం. మున్సిపాలిటీ వారితో కలిసి పుట్‌పాత్ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ నిబంధనలను పాటించే విధంగా చర్యలు తీసుకుంటాం. రాంగ్‌రూట్‌లో వెళ్లేవారిపై, అలాగే అతివేగంగా వెళ్లేవారిపై కూడా చర్యలు తీసుకుంటున్నాం.

- విశ్వనాథరెడ్డి, అర్బన్ సీఐ, ఎర్రగుంట్ల

అంతేకాకుండా పుట్‌పాత్‌కు ఆనుకుని బైక్‌లు కూడా నిలపడంతో భారీ వాహనాలు వెళ్లేందుకు మరీ ఇరుగ్గా మారింది. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో నాలుగు రోడ్ల కూడలిలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నేషనల్ హైవే కావడంతో పాటు సిమెంట్ పరిశ్రమల నుంచి వచ్చే భారీ వాహనాలు నాలుగురోడ్ల కూడలి వద్ద మలుపు తిరిగేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

రాంగ్‌రూట్‌లో ఆర్టీసీ బస్సులు..

నాలుగు రోడ్ల కూడలికి సమీపంలో ఉన్న ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సర్కిల్‌ను తిరిగి వెళ్లాలి. కానీ అలా కాకుండా నేరుగా ప్రొద్దుటూరు వైపు వున్న బ్రిడ్జిపైకి వెళుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముద్దనూరు వైపు నుంచి, ప్రొద్దుటూరు వైపు నుంచి, కడప వైపు నుంచి వచ్చే వాహనాలన్నీ ఆగిపోతున్నాయి. దీంతో ఉదయం రద్దీ సమయంలో, సాయంత్రం 6-8గంటల ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆర్టీసీ బస్సులను రైట్‌రూట్‌లో మళ్లించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలను పట్టించుకోకపోవడంతో వారి తీరులో మార్పు రావడంలేదు.

కలగానే ట్రాఫిక్ సిగ్నల్స్..

ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు ఇప్పటివరకు కలగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు రూ.6లక్షలు పెట్టి సర్కిల్‌ను తూర్పువైపు జరిపి నిర్మించారు. అయితే సర్కిల్‌కు నాలుగువైపులా ఉన్న ఆక్రమణలను సక్రమంగా తొలగించడంలో విఫలమయ్యారు. దీంతో లక్షలు వెచ్చించినా ఎలాంటి ఉపయోగం లేదు. ఆక్రమణలు తొలగించిన రెండూ వైపులా మళ్లీ ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. నాలుగు రోడ్ల చుట్టూ జరిగిన ప్రమాదాలకు కొందరు బలైపోయారు.

పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేందుకే బాలోత్సవం

- డిసెంబరు 25లోగా పేర్లునమోదు చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సృజనాత్మతకత, ప్రతిభను వెలికి తీసేందుకే బాలోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు వి.నాగమునిరెడ్డి, అధ్యక్షుడు బి.గోపాల్ తెలిపారు. సోమవారం నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో డిసెంబరు 29, 30వ తేదీల్లో జరగనున్న కడప బాలోత్సవం-2025 సన్నాహాలకు సంబంధించి వారు విలేకరులతో మాట్లాడారు. ఈ బాలోత్సవంలో చిత్రలేఖనం, నృత్యం, కథలు, వ్యాసరచన, కవితలు, నాటికలు, విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలు వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనదలచిన విద్యార్థులు డిసెంబరు 25లోపు పాఠశాలల ద్వారా గూగుల్ లింక్‌లో నమోదు చేసుకోవాలని, స్పాట్ రిజిస్ట్రేషన్ ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు వీర సుదర్శన్‌రెడ్డి, సభ్యులు కుమారస్వామి రెడ్డి, రవి, శ్రీనివాసులరెడ్డి, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, శివరామ్ పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగాచార్యులు

కడప రూరల్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ చెందిన పంచాయతీరాజ్ ఉద్యోగులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఈ రంగాచార్యులు డిమాండ్ చేశారు. సోమవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్సీ భవనంలో జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీవిరమణ చెందిన పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పీఆర్సీ కమీషన్ నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆలపాటి ముకుందరెడ్డి, జోనల్ కో-ఆర్డినేటర్ హబీబ్, అడ్వైజర్ డాక్టర్ వెంకటేశ్, కార్యదర్శి వెంకటరమణయ్య, ఉపాధ్యక్షుడు కేశవులు పాల్గొన్నారు.

యురేనియం మైన్స్‌లో కొత్త లేబర్ కోడ్స్ అమలు చేయాలి



లేబర్‌కోడ్స్ కరపత్రాలను చూపుతున్న గని కార్మికులు

పులివెందుల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎం.తుమ్మలపల్లె వద్దనున్న యురేనియం మైన్స్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్స్‌ను అమలు చేయాలని నెల్లూరు రీజియన్ గనుల భద్రత అధికారి కిషోర్‌కుమార్ డోకుపర్తి పేర్కొన్నారు. సోమవారం యురేనియం మైన్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భద్రత, ఆరోగ్యం, సంక్షేమంపై పాటించాల్సిన విధివిధానాలను ఆయన వివరించారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. ప్రసూతి సమయంలో 26వారాల వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరికి వార్షిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అంతర్‌రాష్ట్ర వలసకార్మికులకు సంబంధించిన సోషల్ సెక్యూరిటీ బెనిఫిట్స్ వివరించి చర్చించారు. అనంతరం నాలుగు లేబర్‌కోడ్స్‌కు సంబంధించిన కరపత్రాలను గని కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, వెల్ఫేర్ ఆఫీసర్ తారక్, ఎస్ఎంఎస్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు మహాసభలను జయప్రదం చేయాలి

ప్రొద్దుటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 3, 4, 5వ తేదీలలో అమరావతిలో నిర్వహించే మూడవ ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని కవయిత్రి షేక్ పీర్ల ఆయేషా తెలిపారు. సోమవారం స్థానిక మాంటిసోరి హైస్కూలులో ప్రపంచ తెలుగు మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతుల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో కవులు, రచయితలు, మేధావులు, ఉపాధ్యాయులు విద్యార్థులు, భాషాభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు, కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనాథ్‌రెడ్డి, నర్మద్, హైదర్, కుమారి, సాయితులసి, సుజాత, మునీశ్వరి, విజయలక్ష్మి, సంధ్య, స్వర్ణ పాల్గొన్నారు.

రాయలసీమ రైతులను తక్షణమే ఆదుకోవాలి

వాల్మీకిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే రాయలసీమ రైతులను ఆదుకోవాలని, ఇందుకు ప్రభుత్వం స్పందించేలా బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ సోమవారం కడప పెద్ద దర్గాలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీం స్థానిక మైనార్టీ నేతలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్నేళ్లుగా పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు కష్టాలు బారిన పడుతున్నారన్నారు. రాయలసీమలో వరి, టమోటా మామిడి, బొప్పాయి, ఉల్లి, మొక్కజొన్న సాగు చేసినా గిట్టుబాటు ధరలు లేకపోగా తుపాను రూపంలో వంద శాతం పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు, ఖాదర్బాషా, అమీన్‌పీర్, షమీ పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కురబలకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వాధ్వాణి ఫౌండేషన్ సీనియర్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేటర్ విశాల్ విజయ్ నాయర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్ళు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 'ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ యాజ్ కెరీర్ ఆపర్చునిటీస్‌'పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత దేశార్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషించగలదని, నూతన ఆలోచనలతో తన భవిష్యత్తును పునాదులు వేసుకోవాలన్నారు. పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సహాయ సహకారాలు అందిస్తున్నాయని వీటిని సద్వినియోగం చేసుకుని స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ ప్రాజెక్టులు, పరిశ్రమలను స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. విద్యార్థులు నూతన ఆలోచనలతో వృత్తి నైపుణ్యాలను మెరుగు పరచుకోవడంతో పాటుగా ఆ దిశగా అడుగులు ముందుకేయాలన్నారు. పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీన్ రామ కె కొమరగిరి, విభాగాధిపతి భాస్కరన్, కో ఆర్డినేటర్ ప్రవీన్‌కుమార్, రిజవాన్ అలీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాల్ విజయ్ నాయర్

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

- ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి





పోటీలను ప్రారంభిస్తున్న ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదాజయలక్ష్మీదేవి.. బాస్కెట్ బాల్ జట్లతో అధికారులు, పీడీలు

పులివెందుల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మీదేవి అన్నారు. సోమవారం పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం ఆధ్వర్యంలో అంతర కళాశాలల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి, గౌరవ అతిథిగా అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి, ప్రత్యేక అతిథిగా కడప జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ షేక్ గౌస్‌బాషా హాజరై పావురాలు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని, తద్వారా శారీరక-మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. అనంతరం బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. 19 కళాశాలలకు చెందిన జట్లు పాల్గొన్న ఈ పోటీలు ఉత్కంఠగా సాగాయి. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు, పులివెందుల కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు బంగారు వ్యాపారులు



తనికంటి శ్రీనివాస్, వెంకటస్వామిని కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బంగారు వ్యాపారులు తనికంటి శ్రీనివాస్, తనికంటి వెంకటస్వామిలను హైదరాబాద్ వ్యాపారి హేమంత్ శర్మ పెట్టిన కేసులో త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఫస్ట్ ఏడీఎం కోర్టు జడ్జి సురేంద్రనాథ్‌రెడ్డి ఎదుట హాజరుపరిచారు. సీఐ తిమ్మారెడ్డి, మరికొందరు పోలీసులు శుక్రవారం రాత్రి తమను కిడ్నాప్ చేసి ఓ ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో అక్రమంగా నిర్బంధించి తీవ్రంగా కొట్టారని, అప్పులు చెల్లించాలని తుపాకీతో బెదిరించారని నిందితులు జడ్జి ముందు వెల్లడించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి కాలు, చేతులకు అయిన గాయాలను చూపెట్టారు. తనికంటి శ్రీనివాస్ ఇంటికి వచ్చి ఆస్తిపత్రాలు, బంగారు దుకాణం తాళాలు సీఐలు తిమ్మారెడ్డి, వేణుగోపాల్, మరో పోలీసు అధికారి వసంత్ వచ్చి బలవంతంగా తీసుకెళ్లే సీసీ పుటేజ్ ఫోటోలు సైతం జడ్జి ముందు పెట్టారు. సోదరులిద్దరి స్టేట్‌మెంట్‌ను జడ్జి రికార్డు చేశారు. అనంతరం వెంకటస్వామి గాయాలపై స్థానిక ప్రైవైటు ఆసుపత్రికి వెళ్లి అడ్వకేట్ సమక్షంలో వైద్యపరీక్షలు చేయించాలని జడ్జి ఆదేశించారు. దీంతో వెంకటస్వామిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుండి వైద్యుల నివేదిక వచ్చాక ఈకేసును విచారించి కేసు విషయంలో పోలీసులు అనుసరించిన వ్యవహార శైలిపై జడ్జి నిర్ణయం తీసుకోనున్నట్లు కోర్టు వర్గాలు వెల్లడించాయి.

నిబద్ధతతో పనిచేసిన వారికే పదవులు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ అబ్జర్వర్ పోలం దినేష్‌రెడ్డి

బి.కొత్తకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో టీడీపీ పటిష్టతకు నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు సంస్థాగత ఎన్నికల్లో ప్రాధాన్యం లభిస్తుందని తంబళ్లపల్లె నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పోలం దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పార్టీ కన్వీనర్, పట్టణ అధ్యక్షుల ఎంపిక కోసం సోమవారం పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్లో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజమైన కార్యకర్తలకు న్యాయం జరగాలనే లక్ష్యంతోనే పార్టీ హైకమాండ్ పలుమార్లు పరిశీలకులను పంపి సమావేశాలు నిర్వహిస్తోందన్నారు. ఏకగ్రీవం సాధ్యం కాకపోతే ఆశావహుల పేర్లను అధిష్ఠానానికి పంపుతామన్నారు. పార్టీ ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా సరైన అభ్యర్థిని ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ పార్టీ పదవులను ఆశించడంలో తప్పులేదని, అయితే అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేసినా అందరూ సమ్మతించి పార్టీ బలోపేతానికి పనిచేయాలన్నారు. మండల కన్వీనర్ స్థానానికి ఏకంగా 30 మంది తమ పేర్లను నమోదు చేయించారు. టౌన్‌కన్వీనర్ పదవి కోసం 16 మంది ముందుకొచ్చారు. దీంతో చేసేది లేక పరిశీలకులు ఆ పేర్లను నమోదు చేసుకుని వెళ్లారు. కార్యక్రమంలో చిట్టిబాబు, పూల నాగరాజు, మండల, పట్టణ పరిశీలకులు పఠాన్ ఖాదర్‌ఖాన్, శీతప్ప, నేతలు నారాయణస్వామిరెడ్డి, కుడుం శ్రీనివాసులు, బంగారు వెంకట్రమణ, కనకంటి ప్రసాద్, డేరింగుల నారాయణ, సమీవుల్లా, కురవప్రకాష్, శరత్, మస్తాన్, సిద్దారెడ్డి, మస్తాన్‌రెడ్డి, చావిడికిట్టన్న, ప్రభాకర్, కాశిపల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

స్థల వివాదంపై పరస్పర దాడులు

అట్లూరు నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అట్లూరు క్రాస్ రోడ్డు సమీపంలో అయ్యప్పగుడి వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థల వివాదంపై ఇరువురు పరస్పర దాడులు చేసుకోవడంతో ఇరువురికి గాయాలై కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. అయ్యప్ప గుడి వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆరు సెంట్లను 2023లో తమ్మినేని సుబ్బలక్ష్మి, తమ్మినేని శివప్రసాద్, వాసు హరిక్రిష్ణ పేర్లతో అనుబంధం పత్రాలను అప్పటి తహసీల్దారు ఇచ్చారు. ఈ క్రమంలో నెలరోజులక్రితం ఆ స్థలంలో ఇసుక, రాళ్లు తోలడం జరిగింది. సోమవారం ఎక్కవేటరుతో వెళ్లి బేస్‌మట్టం నిర్మించేందుకు గాడి తీస్తుండగా ఆలయ నిర్వాహకుడు నరసింహారెడ్డి అడ్డుపడి ఈ స్థలం అయ్యప్పస్వామి గుడి స్థలం అంటూ రెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆంజనేయులుతో ఘర్షణకు దిగారు. దీంతో నరసింహారెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆంజనేయులుకు వెన్నెముక, చేయి, ఎముకలు విరిగినట్లు స్థానికులు తెలిపారు. తోటి అయ్యప్ప భక్తుడైన నరసింహారెడ్డికి గాయాలు కావడంతో అయ్యప్ప భక్తులంతా రోడ్డుపై బైఠాయించారు. వెంటనే ఎస్‌ఐ రామక్రిష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రమణ, వీఆర్వో నాని సంఘటనాస్థలానికి చేరుకుని అయ్యప్ప భక్తులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించి రెవెన్యూ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిపూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి

పీలేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఓబీల కారణంగా పట్టణంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సుల రాకపోకలను వెంటనే పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం వారు డిప్యూటీ తహసీల్దారుకు విద్యార్థులతో కలిసి వినతి పత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత తేజ మాట్లాడుతూ ఆర్‌ఓబీల నిర్మాణాలకు ఆటంకం కలుగుతుందని పట్టణంలోని ఆర్టీసీ బస్సులను అనుమతించడం లేదన్నారు. అయితే ప్రైవేటు బస్సులను ఎందుకు అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. దీంతో ఆర్టీసీ బస్సులు బైపాస్ రోడ్డులో ప్రయాణించి బస్‌స్టాండుకు చేరుతున్నాయన్నారు. తద్వారా వాటిలో ప్రయాణించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలు మరికొన్ని ప్రైవేటు విద్యాసంస్థలకు చేరుకోవడం విద్యార్థులకు భారంగా మారిందన్నారు. బస్‌స్టాండులో దిగిన తరువాత వారు ఆటోల ద్వారాగానీ, కాలినడకన గానీ విద్యాసంస్థలకు చేరుతున్నారన్నారు. కేవలం విద్యార్థులకే కాకుండా వివిధ పనుల నిమిత్తం వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలకు కూడా బస్సులు లేకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని ఆర్టీసీ బస్సులను అనుమతించాలన్నారు.

అక్రమాలపై విచారణ

- ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో కదిలిన డీఐజీ
- నలుగురు స్టాంప్‌వెండర్ల లైసెన్సులు సస్పెన్షన్.. స్టాకు స్వాధీనం
- దస్తావేజు లేకర్ల అక్రమ వసూళ్లు, ఆగడాలపై ఫిర్యాదుల వెల్లువ

బి.కొత్తకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై సోమవారం ఉన్నతస్థాయి విచారణ ప్రారంభమైంది. కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నారని, లంచం ఇస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని బాధితులు ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కమిషనర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ రిజిస్ట్రేషన్ స్టాంప్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు కడప డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ రామలక్ష్మి పట్నాయక్ సోమవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టారు. బాధిత రైతులు, ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పనితీరు, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ విక్రేతలపై అధికవసూళ్లు, అక్రమాలపై రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కార్యాలయంలో డాక్యుమెంట్‌రైటర్ల రాజ్యం నడుస్తోందని, తమను ఆశ్రయించిన రైతులకు మాయమాటలు చెప్పి, రిజిస్ట్రేషన్లపై కొర్రీలు పెట్టి, కుంటిసాకులతో పెద్దమొత్తంలో సొమ్ము దోచుకుంటున్నారని, ప్రజల సొమ్మును రిజిస్ట్రార్, సిబ్బంది డాక్యుమెంట్ రైటర్లు పంచుకుంటున్నారని జనం ఏకరువు పెట్టారు. జనం, రైతులు ఏకపక్షంగా ఫిర్యాదులు చేయడంతో డీఐజీ విస్తుపోయారు.

అక్రమాలు వాస్తవమే...

బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 1శాతం లంచం తీసుకుంటున్నారు, డాక్యుమెంట్ రైటర్ల హవా నడుస్తోంది. రిజిస్ట్రేషన్లు స్లాట్‌బుకింగ్ ద్వారా జరగడం లేదు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే డాక్యుమెంట్ రైతులకు ఇవ్వడం లేదని విచారణలో తేలినట్లు కడప డీఐజీ పేర్కొన్నారు. పబ్లిక్‌ను లోనికి రానివ్వకుండా డాక్యుమెంట్ రైటర్లు అన్నీ తామై కార్యాలయ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు తేలిందన్నారు. డాక్యుమెంట్‌రైటర్లు బయట చేసే వ్యవహారాలతో తమకు సంబంధం లేదని రిజిస్ట్రార్ చెబుతున్నప్పటికీ సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, స్లాట్ బుకింగ్ ఎప్పుడైంది, డాక్యుమెంట్ ఎప్పుడిచ్చారు అనే వివరాలను జిల్లా కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులకు రిపోర్టు పంపుతామని డీఐజీ తెలిపారు.

నలుగురి లైసెన్సులు సస్పెండ్

స్టాంపులను ఇష్టారాజ్యంగా విక్రయించడంతో పాటు, దస్తావేజు లేకర్లుగా ద్విపాత్రాభినయం చేస్తూ రైతులను మోసం చేస్తున్న నలుగురు స్టాంప్‌వెండర్ల లైసెన్సులు సస్పెండ్ చేస్తున్నామని, వారి వద్ద ఉన్న స్టాకును సైతం స్వాధీనం చేసుకోవాలని ఆదేశించినట్లు డీఐజీ పేర్కొన్నారు. కాగా ఆరోపణలపై డీఐజీ అడిగిన ప్రశ్నలకు రిజిస్ట్రార్ సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారు. తమ భూములకు సంబంధించి తప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగాయని వాటిని రద్దు చేయాలని బాధితులు లిఖితపూర్వక ఫిర్యాదులు చేయగా, వాటిపై విచారణ చేయించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె హామీనిచ్చారు.

'రైతన్నా.. మీకోసం'తో రైతేరాజు

90 శాతంతో మొదటి రోజు ప్రథమ స్థానంలో కలికిరి ● రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం


రైతులకు వివరిస్తున్న ఏఎంసీ చైర్మన్ మాలతి - మిన్నంరెడ్డిగారిపల్లెలో ప్రజలతో వ్యవసాయ శాఖ అధికారులు - వాల్మీకిపురంలో కరపత్రాలు ఆవిష్కరణ

కలికిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల కోసం ప్రారంభించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమానికి రైతుల నుంచి సానుకూల స్పందన లభించింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన 'రైతన్నా.. మీకోసం'లో మొదటి రోజు కలికిరి మండలం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులు రైతు సేవా కేంద్రాల పరిధిలో బృందాలుగా ఏర్పడి రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి తొమ్మిది అంశాల్లో వివరాలు సేకరించాల్సి వుంది. జిల్లాలోని మొత్తం 2,46,247 రైతు కుటుంబాలను వారం రోజుల్లో కలుసుకుని వివరాలు రాబట్టేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. మొదటి రోజు జిల్లాలోని 271 రైతు సేవా కేంద్రాల్లో ఏకకాలంలో సోమవారం సర్వే ప్రారంభమైంది. జిల్లాలోని మొత్తం 30 మండలాల్లో మొదటి రోజు మొత్తం 42,534 మంది రైతు కుటుంబాలకు 24,747 మందిని కలుసుకుని 58 శాతం పూర్తి చేయగలిగారు. దీంతో జిల్లాలో కలికిరి మండలం 90 శాతం పూర్తి చేసి ప్రథమ స్థానం దక్కించుకుంది. మొత్తం 7 ఆర్ఎస్కేల్లోని 7,443 మందిని సంప్రదించాల్సి వుండగా సోమవారం 1,126 మందిని పూర్తి చేశారు. కలికిరి తరువాత పెద్దమండ్యం, కలకడ, బి.కొత్తకోట మండలాలు తరువాతి స్థానాల్లో నిలిచాయి. అతి తక్కువ మంది కలుసుకున్న మండలాల్లో నందలూరు తరువాత నిమ్మనపల్లె, పీటీఎం, పెనగలూరు మండలాలున్నాయి. కలికిరి ఎంపీడీఓ భానుమూర్తి, డిప్యూటీ ఎంపీడీఓ రియాజుద్దీన్, ఎంఏఓ హేమలత, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ సభ్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పీలేరులో...

పీలేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతే రాజు అన్న నానుడిని నిజం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ పీలేరు ఏడీ రమణరావు పేర్కొన్నారు. పీలేరు మండలం కావలిపల్లె, కేవీపల్లె మండలం మిన్నంరెడ్డిగారిపల్లెలో ఆయన సోమవారం 'రైతన్నా, మీ కోసం'లో ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వారిని ఆదుకునేందుకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు అందిస్తున్నారన్నారు. ఈ ఏడాది ఇప్పటికే రెండుసార్లు రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. సబ్సిడీ ధరలకు వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ చేయడం వల్ల పంటను నష్టపోయినప్పుడు రైతులకు పరిహారాన్ని అందజేస్తారన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో సీఎం సందేశ పత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఏఓలు రమాదేవి, మాధవి, హెచ్ఓ సుకుమార్ రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో...

వాల్మీకిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసమే పనిచేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ కోనూరి చంద్రమౌళి అన్నారు. 'రైతన్న మీ కోసం'లో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మనోహర్‌రాజు మాట్లాడుతూ రైతన్న మీ కోసం ద్వారా అధికారులు డోర్ టూ డోర్ వెళ్లి ప్రతి రైతు కుటుంబానికీ ప్రభుత్వం అందిస్తున్న లబ్ధి, వ్యవసాయం లాభసాటిగా చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని, రైతులు మరింత అభివృద్ధి చెందడానికి తీసుకోవాల్సిన చర్యలపై రైతుల సలహాలు సూచనలు పొందాలని సూచించారు. అధికారులంతా ఈనెల 29వ తేదీ వరకు రైతుల ఇంటి వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ, ఇతర శాఖల అధికారులతో కలిసి చైర్మన్ కరపత్రాలను విడుదల చేశారు. ఈఓఆర్డీ సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ కుమార్‌రెడ్డి, అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మదనపల్లెలో...

మదనపల్లె టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ పేర్కొన్నారు. సోమవారం కొండామర్రిపల్లెలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మార్కెట్ కమిటీ కార్యదర్శి జగదీష్, రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. టమోటా రైతులు చేపట్టాల్సి సాగు విధానాలు, పంట మార్కెటింగ్ తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

ములకలచెరువులో....

ములకలచెరువు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మదనపల్లె ఏడీఏ రమేష్‌రాజు, ఏఓ స్రవంతి అన్నారు. బురకాయలకోటలో సోమవారం జరిగిన రైతన్నా...మీ కోసం కార్యక్రమానికి హాజరై రైతుల వివరాలు సేకరించారు. రానున్న ఐదేళ్లలో రైతులను రాజును చేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది పాత ములకలచెరువులో రైతన్నా...మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నేతలు ముత్తుకూరు మౌళా, రామకృష్ణమరాజు, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ బాలాజీ, సిబ్బంది సునీల్, రాజు, రహీం, వీఐఏ షాహీరాబాను తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యం


పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈ

తంబళ్లపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల వ్యవసాయానికి, గృహ వినియోగదారులకు మెరుగైన, విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని డీఈ గంగాధరం అన్నారు. లో వోల్టేజీ సమస్య నివారణకు తంబళ్లపల్లె 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో 5 ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మరను సోమవారం విద్యుత్ అధికారులు ప్రారంభించారు. డీఈ మాట్లాడుతూ వ్యవసాయానికి కరెంటు సరఫరా రాత్రి సమయాల్లో కాకుండా పగటి పూట తొమ్మిది గంటలు విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటున్నందున లో వోల్టేజి సమస్య తలెత్తకుండా వినియోగదారుల సౌకర్యార్థం అదనపు 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ డీఈ సీహెచ్ విజయ్‌భాస్కర్, ఏడీఈ గోవిందరెడ్డి, ట్రాన్స్‌ఫార్మర్ ఏడీ ఆదినారాయణ, ఏఈలు సురేంద్ర, శేషకుమార్, ప్రొటెక్షన్ ఏఈ సుబ్రమణ్యం, ఎల్ఐలు నాగరాజు, భాస్కర్, సిబ్బంది శంకర, ఇంతియాజ్ తదితరులున్నారు.

పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న దినేష్‌రెడ్డి

కురబలకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్త, నేతకు గుర్తింపు దక్కుతుందని ఎన్విరాన్‌మెంటల్ చైర్మన్ పి.దినేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గౌనివారిపల్లె వద్ద టీడీపీ మండల అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి సత్తాచాటాలన్నారు. మండల అధ్యక్షుడి ఎన్నికకు పలువురు పోటీ పడ్డారు. వారిని పరిగణలోకి తీసుకుని అధిష్టానం ఆదేశాల మేరకు ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, రుద్రబాలకృష్ణ, జంగా రాఘవరెడ్డి, అయూబ్ బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేస్తాం : ఎమ్మెల్యే


ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష, శ్రీరాం చినబాబు

మదనపల్లె అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కలిసి కట్టుగా వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. సోమవారం నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ శక్తి వంచన లేకుండా ఆలయాభివృద్ధి నూతన ఆలయకమిటీ ఆధ్వర్యంలో జరుగుతోందని భరోసా ఇచ్చారు. ఆలయ ఆవరణలో పేదల కోసం కల్యాణ మండపం ఏర్పాటుకు దేవదాయ శాఖ మంత్రి అనుమతులతో నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అప్పుడే కళ్యాణ మండపం నిర్మాణ పనులకు మున్సిపల్ కౌన్సిల్ నాగార్జునబాబు(గాంధీ) లక్ష రూపాయలు డొనేషన్ ప్రకటించారు. కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగారపు నవీన్ చౌదరి, సభ్యులు దుబ్బిగాళ్ల భాస్కర్, కదిరి మల్లిక, నాగమణి, మారుతి, బజ్జమ్మ, అజయ్‌పండిత్, కాశీశ్రీరామ్, రాజేష్, మంజునాథ, ఉషాలు కమిటీ సభ్యులుగా ప్రమాణం ఆలయకమిటీ ఈఓ రమణ సమక్షంలో చేయించారు. మాజీ ఆలయ చైర్మన్ రెడ్డెప్పరావు, అయ్యప్ప స్వామి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మార్వారి సుధాకర్ నాయుడు, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, మాజీ కౌన్సిలర్లు రాధ, టీడీపీ నేతలు ఆర్‌జే వెంకటేశ్, కమలమరికృష్ణ, జ్ఞానాంబిక కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, గుర్రప్ప నాయుడు, రాటకొండ మధుబాబు, నంద, మురళి, నాగరాజ, కొప్పులహరినాద్, కదిరి రాజ్‌కుమార్, షిర్డిసాయిబాబా కమిటీ ఉపాధ్యక్షుడు బాబునాయుడు, సుధాకర్, పూల మురళీ, లాయర్ మనోహర్ పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను రక్షించవచ్చు

గుర్రంకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుండె ఆగిన సమయంలో సీపీఆర్ చేయడంతో ప్రాణాలను కాపాడుకోవచ్చని డాక్టర్ రమేష్‌నాథ్ అన్నారు. గుర్రంకొండ జడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు సీపీఆర్‌పై హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ సీపీఆర్‌పై అవగాహన లేక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. విద్యార్థులు సీపీఆర్‌పై తల్లిదండ్రులకు, పెద్దలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం తకివుల్లా, సంస్థ సభ్యులు అబూబక్కర్, మొఖద్దర్, ఆబిద్, సునీల్, నవీన్‌లు పాల్గొన్నారు.

నీటి నిల్వల చెరువులు, కుంటల వివరాలు తెలుసుకోండి

పెద్దమండ్యం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) మండలంలోని చెరువులు, కుంటల పూర్తి వివరాలను అందుబాటులో పెట్టుకోవాలని తహసీల్దార్ తేజస్వి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏఎస్ఓ హుసేన్, వీఆర్వోలతో 7వ చిన్న తరహా నీటి వనరులపై సమీక్షలో ఆమె మాట్లాడుతూ నీటి నిల్వల చెరువుల, కుంటల గణన ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు చెక్‌డ్యామ్ కూడా వివరాలు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ఈ గణనతో భవిష్యత్తులో వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ద్వారా అభివృద్ధి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీటీ సురేష్ కుమార్, ఏఎస్ఓ హుసేన్, ఆర్ఐ భరత్ కుమార్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

అండర్ -14 రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

మదనపల్లె అర్బన్,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి 69వ స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమైనట్లు హెచ్ఎం చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్రంలో 13 జిల్లా కోచ్‌లు, క్రీడాకారులు ఈ టోర్నమెంట్లో పాల్గొన్నారు. రాష్ట్ర అబ్జర్వర్‌వర్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్‌బాబు, జిల్లా కార్యదర్శి నాగరాజ, అడ్మిన్ సెక్రటరీ ఝాన్సీరాణి, క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అన్సర్, భద్రయ్య, రమేష్, శివశంకర్, నరేష్, భారతి, లత, వరలక్ష్మీ, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి విష్ణువర్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... వేపూరికోట పంచాయతీ ఎర్రకాలువపల్లె వాసి విష్ణువర్ధన్ పని నిమిత్తం ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. ఈ క్రమంలో తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గం మధ్యలోని వేపూరికోట వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురిపై ఎస్సీ కేసు నమోదు

కలకడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):ఎస్సీ మహిళను కులం పేరుతో దూషించిన ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు రాయచోటి వాసి నరేష్‌కు అదే పట్టణానికి చెందిన మోహిత్‌రెడ్డి ఆర్థిక లావాదేవిలున్నా యి. ఈ విషయమై నరేష్ కొంత కాలంగా మోహిత్‌రెడ్డి కంటపడకుండా తిరుగుతున్నాడు. గత శనివారం రాత్రి నరేష్ కలకడలోని బంధు వుల పెళ్లికి రావడంతో మోహిత్‌రెడ్డితోపాటు శివారెడ్డి, సందీప్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, రాజేష్‌నాయక్ వారి అనుచరులు డబ్బు విషయమై నిలదీశారు. నరేష్ అత్త సంపూర్ణమ్మపై మోహి త్‌రెడ్డి అను చరులు దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాదాస్పద స్థలంలో మరుగుదొడ్లు నిర్మించాలి

పీలేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పద్మావతి నగర్‌లోని వివాదాస్పద స్థలంలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. రాయచోటిలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదించిన అన్ని స్థలాలను గుర్తించి వాటిల్లో వెంటనే మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆర్డీఓను కోరారు.

ఐబీఎం సాఫ్ట్‌వేర్స్‌పై ఎంజేఆర్ విద్యార్థులకు శిక్షణ


శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న డ్రోన్‌స్ప్రెక్టమ్ సీఎంఓ సమీర్

పీలేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఐబీఎం సాఫ్ట్‌వేర్స్‌పై విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. కళాశాల చైర్మన్ ఎం.వి.అవినాశ్ రెడ్డి మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచ అగ్రసంస్థ ఐబీఎంపై అవగాహన కల్పించేందుకు ఆ సంస్థ ప్రతినిధులతో శిక్షణ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఐబీఎం భాగస్వామ్య సంస్థ అయిన డ్రోన్‌స్ప్రెక్టమ్ సీఎంఓ సమీర్ మాట్లాడుతూ ఐబీఎం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ద్వారా విద్యార్థులకు లభించే ప్రయోజనాలు వివరించారు. ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐబీఎం నేషనల్ రోడ్ సాఫ్ట్‌వేర్ గురించి తెలియజేశారు. సీనియర్ టెక్నికల్ స్పెషలిస్టు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎస్‌పీఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఆ సంస్థ సలహాదారు షారుఖ్ మాట్లాడుతూ మంచి కొలువులు సాధించేందుకు నేర్చుకోవాల్సిన అంశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కేవీఎన్‌వి నరసింహరావు మాట్లాడుతూ ఐబీఎం సంస్థ సిబ్బంది ద్వారా నేర్చుకున్న అంశాలపై పట్టు సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్‌కోస్‌లో చేర్చాలి


ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కలికిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఆప్‌కోస్‌లో జేఎన్టీయూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించాలని ఉద్యోగుల సంఘం డిమాండు చేసింది. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామానుజులు ఆధ్వర్యంలో సోమవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ఉద్యోగుల సంఘం ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావుకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘ నేతలు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రభుత్వ పర్యవేక్షణలో నెలకొల్పిన ఆప్‌కోస్‌లోనే జేఎన్టీయూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను చేర్చారని, తాజా ఆప్‌కోస్ నుంచి తొలగించి కాంట్రాక్టు సంస్థకు అప్పగించారన్నారు. ఆప్కోస్‌లో నమోదైన ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తమ సర్వీసులను ప్రైవేటు కంట్రాక్టు ఏజెన్సీకి అప్పగించడంతో ప్రతి నెలా 17, 18 తేదీల్లో జీతాలు ఇస్తున్నట్లు విమర్శించారు. వేతనాల్లో కోత విధించి వసూలు చేసిన ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తాలను ఆయా ఖాతాల్లో జమచేయడం లేదన్నారు. తమకు సరైన వేతనాలు అందడం లేదని, మరో వైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల నుంచి జీతాల్లో మినహాయించిన మొత్తాలను ఈఎస్ఐ, పీఎఫ్ ఖాతాల్లో జమచేయాలని డిమాండు చేశారు. లేదంటే ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు హెచ్చరించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రియాజ్, సంధ్య, రవి, ఖాదర్, రమణ, షాహీనా, ఏస్తర్, ఆనంద్‌బాబు, యోగేష్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్లబైలుకు కార్యదర్శిని నియమించండి

మదనపల్లె టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు-1, కోళ్లబైలు-2 ఎంచాయతీలకు కార్యదర్శిని నియమించాలని కోళ్లబైలు-1 సర్పంచ్ ఎం.ఆనందరెడ్డి ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌ను కోరారు. సోమవారం ఎంపీడీఓతో ఆయన మాట్లాడుతూ కోళ్లబైలు కార్యదర్శిగా పనిచేసిన మంజులను ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. నెల రోజులు ఈ రెండు గ్రామ పంచాయతీలకు కార్యదర్శిని ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదన్నారు. దీని వలన పంచాయతీలో సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు తలెత్తాయని పారిశుధ్య కార్మికులు వేతనాలు చెల్లించే పరిస్థితి కనపడలేదన్నారు. 2025 ఆడిట్ నిర్వహించాల్సి వుందని, కావున అధికారులు ఈ రెండు గ్రామ పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని వినతి పత్రం అందజేశారు.

మాదిగలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

పీలేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మాదిగలపై దాడి చేసి అగ్రకులస్థులను వెంటనే అరెస్టు చేయాలని మాదిగదళ పోరాట సమితి(ఎండీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య పోలీసులను డిమాండ్ చేశారు. కలకడలో ఆయన ప్రాతికేయులతో మాట్లాడుతూ శనివారం రాత్రి మాదిగల ఇంట జరుగుతున్న వివాహ మండపంలోకి దౌర్జన్యంగా ప్రవేశించిన సందీప్ రెడ్డి, ఆయన అనుచరులు పెళ్లి కుమార్తె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్నారు. వందలాది మంది సమక్షంలో మాదిగల ఆత్మగౌరవంపై దాడి జరగడం శోచనీయమన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న వారందరినీ గుర్తించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోకపోతే దళితుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో మాల ఐక్యవేదిక నేతలు గుర్రం నారాయణ, రామాంజులు, ఎండీపీఎస్ నాయకులు రవి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉయ్యాలవాడ జయంతి

మదనపల్లె టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలను రెడ్డిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం బెంగళూరు రోడ్డులో రెడ్డిసంక్షేమ సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు గుడిబండ రవికుమార్, సంయుక్త కార్యదర్శి కె.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. తమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, కోశాధికారి గిరిధర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు తట్టి శ్రీనివాసులురెడ్డి, మాధవరెడ్డి, శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

మదనపల్లె టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎస్సీ బాలుర వసతి గృహంలో వున్న విద్యార్థులకు బ్రిడ్జి ఇండియా సొసైటీ కార్యదర్శి వి.సుధాకర్ దుప్పట్లు పంపిణీ చేశారు. సోమవారం బాలుర వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ గంగిరెడ్డి మాట్లాడుతూ చలికాలం విద్యార్థులకు సౌకర్యంగా వుండేందుకు 60 ఉలన్ దుప్పట్లను దాత సుధాకర్ అందించారన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాంప్రసాద్, బ్రిడ్జి ఇండియా సొసైటీ సభ్యులు మునివెంకటప్ప, సహదేవ, బీసీ రెడ్డి, రామలింగప్ప, ఎర్రయ్య పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా పురుషోత్తం

మదనపల్లె అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి మండల అధ్యక్షుడిగా పురుషోత్తంను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు పేర్కొన్నారు. స్థానిక బుగ్గకాల్వలో గంగమ్మ ఆలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బొగ్గిటి కృష్ణ మూర్తితో కలిసి నియామక ప్రతం అందించారు. సభ్యులు చెన్నం శ్రీరాములు,. గంగాధర్, జయచంద్ర, నరసింహులు, సందీప్, జయవర్ధన్, చరణ్, ప్రవీణ్ కుమార్, భానుప్రకాష్, దిలీప్ పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): 15 రోజులుగా సోషియల్ మీడియాలో అక్రమ పోస్టులు పెడుతున్న వారిపై, వారిని ప్రోత్సహిస్తున్న వైసీపీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిధున్ రెడ్డిపై సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజారెడ్డికి తెలుగు యువత శ్రీరామ్ చినబాబు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నేతలు మహబూబ్‌బాషా, త్యాగరాజ, సర్పంచ్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబీకులకు ఎస్పీ సంతాపం

మదనపల్లె అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె తాలుకా పోలీస్‌స్టేషన్ హోంగార్డు రమణ కుటుంబసభ్యులకు ఎస్పీ ధీరజ్ కునిబిల్లి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మేము అండగా ఉంటామన్నారు. మృతుడి స్వగ్రామం చిత్తూరు జిల్లా సోమల మండలం, నంజంపేటలో ఆయన భౌతికాయానికి రిజర్వ్ ఎస్ఐ రమేష్, హోంగార్డుల ఇన్‌చార్జ్ రమేష్‌బాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు.